నేటి కందం- నేటికి అందం

భారత నౌకా సంపద
కూరిమితో వెలుగు నటుల గొప్ప బలముతో
మేరువువలె"ఐ యన్ యస్
తారాగిరి"వచ్చి చేరె తాలిమి నొసగన్ !!

(క్రొత్త హంగులతో క్రొత్త సాంకేతికతతో ఐ యన్ యస్ తారాగిరి అనే నౌక నిర్మింపబడి భారత నౌకాదళానికి మరింత పటిష్టతను కల్పిస్తూ భారత నౌకాబలం లో వచ్చి చేరింది.)

-రాధశ్రీ
సెల్:9494481210





# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: భైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com



కాళేశ్వరం ప్రాజెక్టులో
కప్పుకున్న అవినీతి
దోషులెవరో తేల్చకుండా
దేనికింకా దాని ఖ్యాతి
కమిషన్ రిపోర్టు
కడకు చర్యలేమాయే
అప్పగిస్తే సీబీఐకీ
అక్కడెట్లా ఆగిపోయె

-వేల్పుల నారాయణ
9440433475





హైదరాబాద్ ఆదివారం 5-4-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:185 పేజీలు:6 వెల: రూ.1/-


## బాసర ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండాలి..

### -అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం



హైదరాబాద్, ఏప్రిల్ 4: బాసర ఆలయ అభివృద్ధిపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిఈరోజు(శనివారం) సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్ను సీఎంకు అధికారులు వివరించారు. మాస్టర్ ప్లాన్పై అధికారులకు పలు సూచనలు చేశారు సీఎం. ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ, శాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి ఉండాలని సూచించారు.

భవిష్యత్తు అవసరా లను, రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రోడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఆలయ పరిసరాల్లో ఈవీ వాహనాలను మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా నిబంధనలు కఠినతరం చేయాలని ఆదేశించారు. తిరుమల తరహాలో అన్ని ఆలయాల పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నిబంధనలు ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

ఈ సమావేశానికి మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ నెల 6న బాసర ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. రూ.225 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.

## కేరళలో ఎల్డీఎఫ్కు ఉద్వాసన, బీజేపీ విజయం ఖాయం: మోదీ



తిరువనంతపురం, ఏప్రిల్ 4: కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయెన్స్ అధికారంలోకి వస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఎల్డీఎఫ్ ఉద్వాసనకు కౌంట్డౌన్ మొదలైందని చెప్పారు. తిరువళ్ల మున్సిపాలో శనివారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో మోదీ మాట్లాడుతూ, కేరళ అభివృద్ధిపై కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి ఎన్నడూ దృష్టి పెట్టలేదని, 2004-2014 మధ్య కేరళ అభివృద్ధికి అప్పటి కేంద్రలోని యూపీఏ ప్రభుత్వం కేటాయించిన మొత్తం కంటే తమ ప్రభుత్వం ఎక్కువ కేటాయించిందని చెప్పారు. జనాభా నియంత్రణతో దక్షిణాది రాష్ట్రాలు లోక్సభ స్థానాలు కోల్పోతాయంటూ చేస్తున్న వాదనల్లో కూడా నిజం లేదని స్పష్టం చేశారు.

'ఇంతకుముందు కూడా ఇక్కడకు వచ్చాను. కానీ ఈసారి అన్నివైపుల నుంచి మార్పు కోరుతున్న బలమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. కేరళలో అతిపెద్ద మార్పు రాబోతోంది. తొలిసారి బీజేపీ-ఎన్డీయే ప్రభుత్వం కేరళలో అధికారంలోకి రాబోతోంది' అని మోదీ ధీమా వ్యక్తం చేశారు. ఎల్డీఎఫ్-యూడీఎఫ్ ప్రభుత్వాలు ఎప్పుడూ ఈ ప్రాంతం గురించి పట్టించుకోలేదని, రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, చాలా ఏళ్లుగా ఒక్క ప్రధాన బ్రిడ్జి కూడా నిర్మించ లేదని, మెడికల్ కాలేజీ పరిస్థితి దయనీయంగా ఉందని విమర్శించారు. కనీస మౌలిక సదుపాయాలు లేకుండా జీవన ప్రమాణాలు ఏ స్థాయిలో ఉంటాయనేది ఎవరైనా ఊహించవచ్చని అన్నారు.

మోదీ గ్యారెంటీ..

ఎన్డీయే విధానాలతో ప్రతి ఒక్క వర్గానికి, ముఖ్యంగా మహిళలు ఎంతో లబ్ధి పొందుతున్నారని ప్రధాని అన్నారు. వలస కార్మికులకు ఉద్యోగాలు కల్పన కేరళలో అతిపెద్ద సమస్యగా ఉందని, బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని సమస్యలను పరిష్కరిస్తామని, ఇది మోదీ ఇచ్చే హామీ అని ప్రధాని భరోసా ఇచ్చారు. ఈశాన్య రాష్ట్రాలు, గోవా తరహాలోనే కేరళను అభివృద్ధి చేస్తామని అన్నారు. నబరి రైల్వే ప్రాజెక్టు నిలిచిపోవడానికి ఎల్డీఎఫ్ కారణమని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్ని అడ్డంకులూ తొలగిపోతాయని భరోసా ఇచ్చారు. కాగా, కేరళ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 9న ఒకే విడతలో జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

## పాక్కు షాకిచ్చిన యూఏఈ..

## వెంటనే అప్పు తీర్చాలని అల్టిమేటం..



న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో పాకిస్తాన్కు యూఏఈ షాకిచ్చింది. తమ దగ్గర తీసుకున్న అప్పును పూర్తిగా, అది కూడా వెంటనే చెల్లించాలని కోరింది. దీంతో ఈ నెలలోనే యూఏఈ అప్పు తీర్చేందుకు పాక్ సిద్ధమైంది. మొత్తం 3.5 బిలియన్ డాలర్ల అప్పును యూఏఈకి పాకిస్తాన్ ఈ నెలలోనే చెల్లించబోతుంది. ఒకవైపు అంతర్జాతీయ రిజర్వ్లు తక్కువగా ఉన్నా, మరోవైపు ఐఎంఎఫ్ నుంచి ఒత్తిడి ఉన్నా.. పాక్ తప్పనిసరి పరిస్థితుల్లో అప్పు తీర్చేయబోతుంది.

ప్రస్తుతం ఇరాన్ యుద్ధం కారణంగా యూఏఈ కూడా ఆర్థిక సమస్యల్ని ఎదుర్కొంటుంది. దీంతో తమ బాకీ చెల్లించాలని పాక్ను కోరింది. దీనికి పాకిస్తాన్ కూడా అంగీకరించింది. ఈ నెల 11న 450 మిలియన్ డాలర్లు, 17న 2 బిలియన్ డాలర్లు, 23న బిలియన్ డాలర్లను పాక్ చెల్లించేందుకు అంగీకరించింది. సెంట్రల్ బ్యాంకుకు చెందిన 16.4 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వల నుంచి ఈ నిధులను పాక్ చెల్లించబోతుంది. ఈ అప్పుల్లో మూడు దశాబ్దాల నాటి అప్పు కూడా ఉండటం విశేషం. 1996-97లో పాకిస్తాన్ 450 మిలియన్ డాలర్లను అప్పుగా తీసుకుంది. అప్పట్లో ఒక సంవత్సర కాల పరిమితితో ఈ అప్పు తీసుకుంది. అయితే, ఇంతవరకు చెల్లించలేదు. ఈసారి మాత్రం చెల్లించబోతుంది. నిజానికి పాకిస్తాన్కు ఇచ్చిన అప్పు కాల పరిమితిని పొడిగించాలని ఇటీవల యూఏఈ నిర్ణయించింది. దీనిపై ఇంకా సంప్రదింపులు జరుగుతున్నాయి.

కానీ, ఈలోగానే ఇరాన్ యుద్ధం ప్రారంభమవ్వడంతో యూఏఈ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. డబ్బులు చెల్లించాలని పాక్ను కోరింది.

# అమెరికా ప్రతిదాడి



**ఒకరు మృతి**
**ఐదుగురికి గాయాలు**
**ఇరాన్లో కీలక కేంద్రాలపై దాడులు**
**ఖుజెస్తాన్ పెట్రోకెమికల్ జోన్లో భారీ అగ్ని ప్రమాదం**
**మహ్షహర్ ప్లాంట్లపై వైమానిక దాడులు**
**బుషెహర్ అణు కేంద్రంపై మరోసారి దాడి**
**అణు కేంద్రంలో భద్రతా అధికారికి మృతి**
**రేడియేషన్ లీకేజీ లేదని అంతర్జాతీయ సంస్థ స్పష్టం**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4:అమెరికా ఎంత మొత్తుకొంటున్నా.. ఇరాన్ అసలు తగ్గటం లేదు. ఇక సహించలేని స్థితిలో తమ ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీకి అమెరికా, ఇజ్రాయెల్ పదును పెట్టాయి. దక్షిణ ఇరాన్ ఖుజెస్తాన్ ప్రావిన్స్లోని పెట్రోకెమికల్ ప్లాంట్లు, బుషెహర్ అణు కేంద్రంపై శనివారం ఉదయం విరుచుకుపడ్డాయి. : మహ్షహర్ స్పెషల్ పెట్రోకెమికల్ జోన్లోని ఫజ్ర్ 1 , 2 , రెజాల్ , అమీర్ కబీర్ పెట్రోకెమికల్ ప్లాంట్లపై వైమానిక దాడులు జరిపాయి. దక్షిణ ఇరాన్‌లోని ఖుజెస్తాన్ బుషెహర్ ప్రాంతాలపై శనివారం తెల్లవారుజామున దాడులు జరిగాయి. భారత కాలమానం ప్రకారం ఉదయం 7:30 ఒఠ నుండి 8:15 ఒఠ మధ్య ఈ వైమానిక దాడులు , క్షిపణి దాడులు జరిగాయి. ఈ దాడుల్లో ఒకరు మృతి చెందారు. ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. బందర్ ఇమామ్ పెట్రోకెమికల్ కాంప్లెక్స్లో కొన్ని భాగాలు దెబ్బతిన్నాయి. ఖోర్రంషహర్ కౌంటీలోని షలామ్చె సరిహద్దు వాణిజ్య టెర్మినల్పై కూడా దాడి జరిగి భారీ నష్టం వాటిల్లింది.

బుషెహర్ అణు కేంద్రంపై దాడి ఇరాన్ ఏకైక కార్యాచరణ అణు విద్యుత్ కేంద్రం బుషెహర్పై శనివారం ఉదయం మరోసారి దాడి జరిగింది. ఈ దాడిలో ఒక భద్రతా అధికారి మరణించినట్లు ఇరాన్ అణుశక్తి సంస్థ ధృవీకరించింది.

క్షిపణి దాడితో ప్లాంట్లోని ఒక అడ్మినిస్ట్రేటివ్ , లాజిస్టికల్ భవనం దెబ్బతింది. ప్రధాన రియాక్టర్ లేదా ఇతర కీలక విభాగాలకు ఎటువంటి నష్టం జరగలేదని, రేడియేషన్ లీకేజీ కాలేదని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ తెలిపింది. భద్రతా కారణాల దృష్ట్యా, ప్లాంట్లో పనిచేస్తున్న 163 మంది రష్యన్ సిబ్బందిని సాంకేతిక నిపుణులను రష్యాకు తరలించారు.

ఇరాన్ ఆర్థిక, ఇంధన మౌలిక సదుపాయాలను దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ, ఇరాన్ మౌలిక సదుపాయాలను "నాశనం చేయడం" ఇంకా పూర్తి కాలేదని హెచ్చరించారు. దీనికి ప్రతిస్పందనగా ఇరాన్ తన క్షిపణి డ్రోన్ దాడులను అమెరికా/ఇజ్రాయెల్ స్థావరాలపై ముమ్మరం చేసింది.



ఇరాన్ 2 అమెరికా యుద్ధ విమానాలను కూల్చినందుకు ప్రతీకారంగా ఈ దాడులు జరిగాయి. -15ఇ , ఏ-10 అమెరికా యుద్ధ విమానాలను ఇరాన్ కూల్చివేసింది. ఇది అమెరికాకు పెద్ద దెబ్బ. తమ విమానాలను కూల్చివేసినందుకు ప్రతిచర్యగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ ఇంధన అణు మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోవాలని ఆదేశించారు. ఇరాన్ ఆర్థిక వెన్నెముక అయిన పెట్రోకెమికల్ ప్లాంట్లను వ్యూహాత్మక అణు కేంద్రాలను (బుషెహర్) దెబ్బతీసి రాన్ను లొంగదీసుకోవాలని అమెరికా భావిస్తోంది.

## ఖానాపూర్ చైర్మన్ ఎన్నిక వాయిదా..
## బీజేపీ, బీఆర్ఎస్ సీరియస్

నిర్మల్, ఏప్రిల్ 4: జిల్లాలో ఉత్కంఠ రేపిన ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా వేయడంపై బీజేపీ, బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహించారు. ఖానాపూర్ మున్సిపల్ కార్యాలయంలోనే బైఠాయించి ఆందోళనకు దిగారు. బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థిని చైర్మన్గా ఎన్నుకోవడానికి సరిపడా కోరం ఉన్నప్పటికీ.. ఎన్నికను అధికారులు వాయిదా వేయడంపై మండిపడుతున్నారు. దీంతో ఆగ్రహించిన ఇరుపార్టీల కౌన్సిలర్లు, నేతలు, కార్యకర్తలు నిరసనకు దిగారు. వారికి మద్దతుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితీశ్ రాథోడ్, బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్ఛార్జ్ జాన్సన్ నాయక్ ఆందోళనలో పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ వచ్చి ఖానాపూర్ మున్సిపల్ ఎన్నికను నిర్వహించాలని, లేదంటే చనిపోయే వరకూ ఇక్కడే కూర్చుంటామని వారు తేల్చి చెప్పారు. అలా కాకుంటే హైదరాబాద్ ఎన్నికల సంఘం వద్ద ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని డిమాండ్ చేశారు. కౌన్సిల్ సభ్యులకు అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా చైర్మన్ ఎన్నిక ఎలా వాయిదా వేస్తారని కౌన్సిలర్లు ప్రశ్నిస్తున్నారు. ఈ నిరసన కారణంగా తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో ఖానాపూర్ 8వ వార్డు బీజేపీ కౌన్సిలర్ బొప్పారావు సత్యవతి కళ్లు తిరిగి పడిపోయారు. ఆమెను తోటి కౌన్సిలర్లు అంబులెన్స్లో ఆస్పత్రికి తరలించారు.

ఖానాపూర్ మున్సిపల్ ఎన్నిక వాయిదా పడినప్పటికీ నేడు మరో రెండు మున్సిపాలిటీలకు ఎన్నికలు సజావుగా జరిగాయి. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీని బీఆర్ఎస్- సీపీఐ కూటమి దక్కించుకుంది. చైర్పర్సన్గా బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ గుడిసెల సంధ్యారాణి ఎన్నిక కాగా.. వైస్ చైర్పర్సన్గా సీపీఐ అభ్యర్థి సరిత ఏకగ్రీవం అయ్యారు. కాంగ్రెస్ పార్టీకి బలం లేకపోవడంతో ఎన్నికకు దూరంగా ఉంది. అలాగే రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ పీఠాన్ని బీఆర్ఎస్, బీజేపీ కైవసం చేసుకున్నాయి. చైర్మన్గా బీఆర్ఎస్ అభ్యర్థి టేకుల సుదర్శన్ రెడ్డి, వైస్ చైర్పర్సన్గా బీజేపీ అభ్యర్థి శ్యామల ఎన్నికయ్యారు.

## తిర్యాని పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

అమరావతి, ఏప్రిల్ 4:జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్ శనివారం రోజున తిర్యాని పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, నమోదు చేసిన రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి, స్టేషన్ హాజరు రిజిస్టర్, స్టేషన్ శుభ్రత తదితర విభాగాలను పరిశీలించారు. ఎస్హెచ్ఓ వెంకటేష్ కు, స్టేషన్ సిబ్బందికి, ఎస్పీ పలు సూచనలు చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి పోలీసు సిబ్బందీ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో చట్టవ్యతిరేకచర్యలు, అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణా, మాదకద్రవ్యాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. మండల కేంద్రంలో, గ్రామాల్లో ప్రజలు వ్యాపారస్తులు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా కృషి చేయాలని అన్నారు.

## భారీ ఉగ్రకుట్ర భగ్నం.. నలుగురు ఉగ్రవాదుల అరెస్టు..

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: దేశంలో భారీ పేలుళ్ల ఉగ్రకుట్రను ఉత్తర్ ప్రదేశ్ పోలీసులు భగ్నం చేశారు. పేలుళ్లకు ప్రణాళికలు రచించిన నలుగురిని ఉత్తర ప్రదేశ్ ఉగ్రవాద నిరోధక దళం(ఏటీఎస్) అరెస్టు చేసింది. నిందితులకు పాక్ ఉగ్ర సంస్థలతో సంబంధాలు ఉన్నట్లు విచారణలో తేలింది. నలుగురు నిందితులను సాకిబ్ అలియాస్ డెవిల్, వికాస్ గెహ్లోవత్ అలియాస్ రౌనక్, లోకేశ్ అలియాస్ పాప్లా పండిట్ అలియాస్ బాబు అలియాస్ సంజు, అర్బాబ్గా గుర్తించారు. పాకిస్థాన్ హ్యాండ్లర్ల ఆదేశాల మేరకు వీరంతా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వీరంతా దేశవ్యాప్తంగా పేలుళ్లకు ప్లాన్ చేసినట్లు పోలీసులు తెలిపారు. నలుగురు నిందితులు టెలిగ్రామ్, ఇన్స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా పాకిస్థాన్ తీవ్రవాద గ్రూపులతో సంబంధాలు కలిగి ఉన్నట్లు విచారణలో ఏటీఎస్ పోలీసులు గుర్తించారు. ప్రధాన నిందితుడు మీరట్కు చెందిన సాకిబ్ అలియాస్ డెవిల్ అని తెలిపారు. మిగిలిన ముగ్గురితో కలిసి దేశంలో అతను పేలుళ్లకు ప్లాన్ చేసినట్లు వెల్లడించారు. ఏప్రిల్ 2న లక్నో రైల్వేస్టేషన్ వద్ద పేలుడుకు కుట్ర పన్నుతుండగా పక్కా సమాచారంతో ఘటనా స్థలానికి వెళ్లి వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

వీరిపై బీఎన్ఎస్, ఉపా చట్టాల కింద కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుల నుంచి పేలుడు పదార్థాలు, ఏడు స్మార్ట్ ఫోన్లు, 24 కరపత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ నిందితులు కొన్ని ప్రదేశాల్లో చిన్నపాటి పేలుళ్లకు పాల్పడ్డారని.. దాన్ని వీడియో తీసి ఉగ్రసంస్థలకు పంపారని పోలీసులు తెలిపారు. దాని ద్వారా ఉగ్రసంస్థల నుంచి నిధులు సేకరించారని పేర్కొన్నారు. వీరంతా సోషల్ మీడియాను ఉపయోగించి యువతను తీవ్రవాదం వైపు ఆకర్షించే ప్రయత్నం చేశారన్నారు.రైల్వే సిగ్నల్స్, గ్యాస్ సిలిండర్ల ట్రక్కులు, ప్రభుత్వ కీలక ఆస్తులే లక్ష్యంగా దాడికి ప్లాన్ చేసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే వీరంతా రాజకీయ ప్రముఖుల ఇళ్లు, ప్రముఖ సంస్థల వద్ద రెక్కీ నిర్వహించారని.. ఆ సమాచారాన్ని పాకిస్థానీ హ్యాండ్లర్లకు పంపారని తెలిపారు. ఘజియాబాద్, అలీగఢ్, లక్నోతోపాటు ప్రముఖ ప్రదేశాల్లో వీరంతా సర్వే చేశారని పోలీసులు పేర్కొన్నారు.

## పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట..

**-ప్రతీ కుటుంబానికి అందుతున్న సంక్షేమ ఫలాలు**
**-శ్రీ బుగులు వెంకట్వేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపకల్పన**
**-త్వరలోనే మండల కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన**
**-2014కు ముందు కల్వకుంట్ల కుటుంబం ఆస్తులు ఎన్ని ఇప్పుడు ఎన్ని..**
**-తెలంగాణ వనరులు దోచుకొని ఆస్తులు కూడబెట్టుకున్నారు**
**రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందాం**
**- మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

చిలుపూర్, ఏప్రిల్ 4: చిలుపూర్ మండల కేంద్రంలోని వరలక్ష్మి గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ మరియు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణి కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా చిల్పూర్ మండలానికి సంబం దించిన 40మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు 40లక్షల 04వేల 640రూపాయల విలువగల చెక్కులను మరియు 41మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు 12లక్షల 74వేల రూపాయల విలువగల చెక్కులను పంపిణి చేశారు.

అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.8లక్షల కోట్లకు వాయిదాలు, మిత్తిలు చెల్లిస్తూ కూడా పేద వర్గాల సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వ సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే కొత్త పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2సంవత్సరాల కాలంలో ప్రవేశ పెట్టిన పథకాల ద్వారా రాష్ట్రంలోని ప్రతీ కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వెల్లడించారు.

మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం ద్వారా 200యూనిట్ల ఉచిత విద్యుత్, దేశంలో ఎక్కడా లేని విధంగా పేద ప్రజలకు రేషన్ షాపుల ద్వారా ఉచిత సన్న బియ్యం పంపిణి, నిరుపేద కుటుంబాలకు రేషన్ కార్డులతో వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతులకు అండగా నిలుస్తూ రైతులకు రైతు భరోసా ద్వారా పెట్టుబడి సహాయం, సన్నాలకు రూ.500బోనస్, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పించడం, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ వంటి రైతు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు.

# దేశ ఆర్థిక అభివృద్ధిలో సముద్ర జలాల పాత్ర కీలకం

## (05 ఏప్రిల్ "జాతీయ సముద్ర దినోత్సవం" సందర్భంగా)

భారత దేశ నలుమూల 7,517 కిమీ విస్తీర్ణంతో సముద్ర తీరం ఉన్నది. మానవ, వస్తు రవాణా రంగంలో ప్రధాన భూమిక నిర్వహిస్తున్న సముద్రాల ద్వారా ఇతర దేశాలతో సంబంధాలు కూడా నెలకొంటున్నాయి. సముద్ర ఆధార పరిశ్రమలు, ఓడ రేవులు, సముద్ర భద్రత, పర్యావరణ పరిరక్షణ, సముద్ర ఆహారం, సముద్ర ఆధార ప్రజాజీవనాలు లాంటి ప్రయోజనాలను గుర్తించిన పౌర సమాజం ప్రతి ఏట 05 ఏప్రిల్ రోజున "జాతీయ సముద్ర దినోత్సవం" లేదా "నేషనల్ మారిటైమ్ డే"ను పాటించుట 1919 నుంచి ఆనవాయితీగా మారింది. విశ్వవ్యాప్తంగా సముద్ర ఉపరితల ప్రాధాన్యాన్ని గుర్తించి ప్రతి ఏట 25 సెప్టెంబర్‌న "ప్రపంచ సముద్ర దినం" కూడా నిర్వహించుట కొనసాగుతున్నది.

2026 జాతీయ సముద్ర దినోత్సవ ఇతివృత్తం:

జాతీయ సముద్ర దినోత్సవం-2026 ఇతివృత్తంగా "సముద్ర భారతం - సాధికారతతో కూడిన ప్రగతి" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతున్నది. నేడు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 80 శాతం వరకు సరుకులు, మానవ రవాణా సముద్ర ఉపరితలం మీదుగానే జరుగుతూ దేశాల ఆర్థికాభివృద్ధికి ఊతం ఇస్తున్నాయి. సముద్ర రంగం మిలియన్ల ఉద్యోగాలకు నెలవుగా మారింది. మిలియన్ల కుటుంబాలు సముద్ర ఆహారమే తమ జీవనోపాధిగా బతుకులు కొనసాగిస్తూ ఉన్నారు. సముద్రాలు భూగోళ వాతావరణ సానుకూల మార్పులకు దోహదపడుతున్నారు. ప్రతికూల వాతావరణ మార్పులను తగ్గించడంలో కూడా సముద్రాలు దోహదపడుతున్నాయి.

జాతీయ సముద్ర దినోత్సవ చరిత్ర, ప్రాముఖ్యత:

05 ఏప్రిల్ 1919న ఎస్. ఎస్. లాయల్టీ చొరవతో ముంబాయి నుంచి లండన్ వరకు నౌకాయానం చేస్తూ చరిత్ర సృష్టించగా, ఆ చారిత్రక సముద్రయానానికి గుర్తుగా జాతీయ సముద్ర దినోత్సవాన్ని ప్రారంభించగా, 05 ఏప్రిల్ 1964 నుంచి భారత ప్రభుత్వం కూడా అధికారికంగా నిర్వహించడం జరుగుతోంది. భారత దేశంలో 13 ప్రధాన ఓడరేవులు, 200 సాధారణ ఓడ రేవులు ద్వారా సాలీనా 1,200 మిలియన్ టన్నుల సరుకుల రవాణా జరుగుతూ, 5 శాతం భారత జిడిపీ సాధిస్తూ, దాదాపు 690 బిలియన్ డాలర్ల విదేశీ మారక ద్రవ్యం లభిస్తున్నది. నేడు సముద్ర ఆధార రంగాల్లో 14 మిలియన్లకు పైగా ఉద్యోగులు సేవలు అందించడం జరుగుతున్నది.

జాతీయ సముద్ర దినం సందర్భంగా సముద్ర రంగం పట్ల అవగాహన కల్పించడం, యువతను సముద్ర రంగ ఉద్యోగాల వైపు ఆకర్షించడం, సుస్థిర షిప్పింగ్ నెలకొల్పడం, సముద్రయానా చేస్తున్న ఉత్సాహవంతులైన నావికులను గుర్తించడం, భారత సముద్ర రంగాన్ని పటిష్ట పర్చుకోవడం, విద్యాలయాల్లో సముద్ర రంగ అంశాల పట్ల పోటీలు నిర్వహించడం లాంటి కార్యక్రమాలను నిర్వహించడం కొనసాగుతున్నది. సముద్ర ఉపరితల ప్రాధాన్యాల ఆధారంగా ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-30కి చెందిన సముద్ర గర్భంలో జీవనం, వాతావరణ మార్పుల చర్యలు, పరిశ్రమలు/నూతన ఆవిష్కరణలు/వమౌళిక వనరులు, అంతర్జాతీయ భాగస్వామ్యం లాంటివని కూడా సాధించుట సుసాధ్యం అవుతున్నది.



-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# భారతదేశ సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు.. వృద్ధి నుంచి ప్రపంచ స్థాయి పోటీ దిశగా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4:ఆహార భద్రత, ఉపాధి, ఎగుమతి ఆదాయం, స్థిరమైన జీవనోపాధిని అందించటంలో భారత మత్స్య రంగం కీలక పాత్ర పోషిస్తోంది. 2015 నుంచి భారత ప్రభుత్వం ఈ రంగంలో రికార్డు స్థాయిలో రూ.39,272 కోట్ల పెట్టుబడులు పెట్టింది. ఈ రంగం ప్రాథమిక స్థాయిలో దాదాపు 3 కోట్ల మంది మత్స్యకారులకు, చేపలు సాగు చేసే రైతులకు ఉపాధిని కల్పిస్తోంది. ఇక అనుబంధ రంగాలతో కలిపితే ఈ సంఖ్య రెట్టింపు స్థాయిలో ఉంటుంది. ప్రపంచ చేపల ఉత్పత్తిలో సుమారు 8 శాతం వాటాతో చేపల పెంపకంలో ప్రపంచంలోనే రెండో అతిపెద్ద దేశంగా భారత్ నిలిచింది. దశాబ్ద కాలంగా మత్స్య రంగం సంప్రదాయక పోకడలను దాటి వాణిజ్యపరంగా కీలక రంగంగా మారింది. చిన్న తరహా మత్స్యకారులందరితో కలిసి సమగ్ర వృద్ధిని సాధించటం ఉత్పత్తిలో స్పష్టంగా కనిపిస్తోంది. 2019-20లో 141.64 లక్షల టన్నులుగా ఉన్న చేపల ఉత్పత్తి.. 2024-25 నాటికి 197.75 లక్షల టన్నులకు చేరుకుంది. ఈ రంగం ఏటా సగటున 7 శాతం వృద్ధిని నమోదు చేస్తోంది.

గత 11 ఏళ్లలో భారతదేశ సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు సగటున 7 శాతం వార్షిక వృద్ధితో గణనీయమైన, స్థిరమైన పురోగతిని సాధించాయి. 2013-14 ఆర్థిక సంవత్సరంలో రూ. 30,213 కోట్లుగా ఉన్న ఈ ఎగుమతులు.. 2024-25 నాటికి రెట్టింపునకుపైగా పెరిగి రూ.62,408 కోట్లకు చేరుకున్నాయి. ఇందులో రూ. 43,334 కోట్ల విలువైన రొయ్యల ఎగుమతులు ప్రధాన పాత్ర పోషించాయి.

సుమారు 350కి పైగా రకాల సముద్ర ఉత్పత్తులతో భారత్ వైవిధ్యమైన ఎగుమతులు చేస్తుంది. ఇవి ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 130 దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. 2024-25 గణాంకాల ప్రకారం.. అమెరికాకు భారత ఎగుమతుల్లో అత్యధికంగా 36.42 శాతం వాటాతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. రెండో ప్రధాన మార్కెట్‌గా చైనా ఉంది. ఆ తర్వాత యూరోపియన్ యూనియన్, ఆగ్నేయాసియా, జపాన్, మధ్యప్రాచ్య దేశాలు, ఇతర ప్రపంచ మార్కెట్లన్నింటికీ సుమారు 9 శాతం వాటా ఉంది. భారతదేశ సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో ప్రధానంగా శీతలీకరించిన రొయ్యలు, ఆ తర్వాతి స్థానాల్లో శీతలీకరించిన చేపలు, స్క్విడ్, ఎండబెట్టిన ఉత్పత్తులు, కటిల్‌ఫిష్, సురిమి ఆధారిత ఉత్పత్తులు, సజీవ, శీతలీకరించిన సముద్ర ఉత్పత్తులున్నాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా డిమాండ్‌తో పాటు ఉత్పత్తుల వైవిధ్యతను ప్రతిబింబిస్తోంది. మొత్తం సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో విలువ ఆధారిత ఉత్పత్తుల వాటా 2.5 శాతం నుంచి 11 శాతానికి పెరిగింది. దీని ద్వారా లభించే ఎగుమతి విలువ 742 మిలియన్ డాలర్లకు చేరుకుంది.

కొన్ని వస్తువులపై అతిగా ఆధారపడటాన్ని తగ్గించటానికి, ప్రపంచ సముద్ర ఉత్పత్తుల మార్కెట్లో భారత్ ఉనికిని మరింత బలోపేతం చేయటానికి ఎగుమతి ఉత్పత్తుల వైవిధ్యతను ప్రభుత్వం క్రియాశీలకంగా ప్రోత్సహిస్తోంది. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ద్వారా విలువ ఆధారిత వ్యవస్థ అంతటా విస్తృతమైన మద్దతును మత్స్య శాఖ అందిస్తోంది. ఇందులో భాగంగా నాణ్యమైన చేప పిల్లల ఉత్పత్తి, ఉప్పు నీటి సాగు, ఎగుమతి ఆధారిత జాతులు, సాంకేతిక పరిజ్ఞానం, వ్యాధులను గుర్తించటం, ఉత్పత్తుల మూలాలను గుర్తించే వ్యవస్థలను బలోపేతం చేయటం, సామర్థ్య పెంపు వంటి అంశాలపై దృష్టి సారిస్తోంది. సముద్ర ఉత్పత్తుల రంగాన్ని బలోపేతం చేయటానికి పంట అనంతర మౌలిక సదుపాయాలు, నిరంతరం అందుబాటులో ఉండే శీతలీకరణ వ్యవస్థలు, ఆధునిక ఫిషింగ్ హార్బర్లు, చేపల ల్యాండింగ్ కేంద్రాల అభివృద్ధిలో పెట్టుబడులను పెంచుతోంది. అంతేకాక.. అంతర్జాతీయంగా ప్రధాన మార్కెట్లలో పట్టు సాధించటానికి, ఉత్పత్తుల వైవిధ్యతను పెంచటానికి చేపల పెంపకంలో అధిక విలువ గల జాతుల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. వాటిలో ట్యూనా, సీబాస్, కోబియా, పాంపానో, గిఫ్ట్ తిలాపియా, గ్రూపర్ వంటి చేపల రకాలు.. పీతలు, టైగర్ రొయ్యలు, స్కాంపీ, సముద్రపు పాచి వంటివి ఉన్నాయి. భారతదేశ ఎగుమతి పరిధిని విస్తరించటం, అంతర్జాతీయ మార్కెట్లలో ఉత్తమ ధరలను పొందటమే దీని ఉద్దేశం.

కీలక అంతర్జాతీయ మార్కెట్లలో భారత్ స్థానాన్ని నిలుపుకునేందుకు మత్స్య రంగాన్ని అంతర్జాతీయ నిబంధనలకు, స్థిరత్వ ప్రమాణాలకనుగుణంగా క్రమబద్ధీకరిస్తోంది. ప్రధానంగా అమెరికా నిబంధనలకు అనుగుణంగా ఉండటంపై భారత్ ప్రత్యేక దృష్టి సారించింది. మెరైన్ మామల్ ప్రొటెక్షన్ యాక్ట్ (ఎంఎంపీఏ) ప్రకారం.. సముద్ర క్షీరదాలు వలల్లో చిక్కుకోకుండా తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. శాస్త్రీయ అంచనాలు, సంబంధిత వర్గాలతో జరిపిన సంప్రదింపుల ఫలితంగా 2025లో అమెరికా అధికారుల నుంచి అనుకూలత గుర్తింపును భారత్ పొందింది. దీనివల్ల డిసెంబర్ 2025లో గడువు తర్వాత కూడా అంతరాయం లేకుండా అమెరికా మార్కెట్‌కు సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు కొనసాగాయి. వన్యప్రాంత రొయ్యల ఎగుమతులపై ఆంక్షలను తొలగించటానికి రొయ్యల ట్రాలీలకు తాబేలు బహిష్కరణ పరికరాలను (టీఈడీలు) అమర్చే ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. తీరప్రాంత రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఎగుమతి చేసే ఉత్పత్తుల నాణ్యతను గుర్తించే విధానాలను, ధ్రువీకరణ వ్యవస్థలను ప్రభుత్వం మరింత బలోపేతం చేసింది. ఆహార భద్రత, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రతి దశలోనూ నిశితంగా పర్యవేక్షించేందుకు జాతీయ డిజిటల్ వ్యవస్థను ప్రారంభించింది. భారతదేశ ప్రత్యేక ఆర్థిక మండలిలో సుస్థిరమైన చేపల వేటను నియంత్రించే నూతన నిబంధనలతో పాటు భారతదేశాన్ని బాధ్యతాయుతమైన, అంతర్జాతీయ ప్రమాణాలను పాటించే సముద్ర ఉత్పత్తుల ఎగుమతిదారుగా నిలబెట్టేందుకు జరుగుతున్న సమష్టి కృషిని ఈ చర్యలు ప్రతిబింబిస్తున్నాయి.

మత్స్య రంగంలో వ్యాపార నిర్వహణను సులభతరం చేసేందుకు భారత మత్స్య శాఖ పలు నియంత్రణ, దిగుమతి ప్రక్రియలను చేపట్టింది. ఇందులో భాగంగా శానిటరీ ఇంపోర్ట్ పర్మిట్ (సిప్) వ్యవస్థను పూర్తిగా డిజిటలైజ్ చేసి, జాతీయ సింగిల్ విండో వ్యవస్థతో అనుసంధానించారు. దీనివల్ల గతంలో అనుమతుల కోసం 30 రోజుల సమయం పట్టగా.. ఇప్పుడు 72 గంటల్లోనే పని పూర్తవుతుంది. వాణిజ్య కార్యకలాపాలను సులభతరం చేసేందుకు ఎస్ఎఫ్‌పీ రొయ్యల బ్రూడ్‌స్టాక్, చేప నూనె, పరిమిత ఆర్ అండ్ డీ నమూనాలు, కేవలం విలువను జోడించటం, తిరిగి ఎగుమతి చేసే అడవి చేపల దిగుమతులపై ఎస్ఐపీ నిబంధనలను ప్రభుత్వం మినహాయించింది. ఇటీవలి చట్టపరమైన సంస్కరణలు చేపల పెంపకం యూనిట్లపై నిబంధనల భారాన్ని మరింత తగ్గించాయి. ఈ రంగాన్ని వాణిజ్యానికి అనుకూలంగా, పెట్టుబడులకు సిద్ధంగా మార్చేందుకు ప్రభుత్వ ప్రయత్నాలను ఇది స్పష్టం చేస్తుంది.

వచ్చే ఐదేళ్లలో భారత ప్రభుత్వం సముద్ర ఉత్పత్తుల ఎగుమతి వ్యూహాన్ని మరింత బలోపేతం చేయాలని యోచిస్తోంది. ఇందులో భాగంగా అధిక విలువ గల ఎగుమతులు, మార్కెట్ విస్తరణ, నాణ్యతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించనుంది. విస్తృతమైన ప్రాసెసింగ్ సౌకర్యాలు, నైపుణ్యం గల సిబ్బంది, మెరుగైన ధ్రువీకరణ వ్యవస్థల ద్వారా మొత్తం ఎగుమతుల్లో విలువ ఆధారిత ఉత్పత్తుల వాటాను పెంచటమే లక్ష్యంగా పెట్టుకుంది. యూకే, ఈయూ, ఏసియాన్, పశ్చిమాసియా దేశాలకు మార్కెట్ల ఎగుమతులను పెంచే ప్రయత్నాలతో పాటు దేశీయంగా ఎగుమతి కేంద్రాలను, మంచినీటి సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయానికి కృషి చేస్తోంది. మెరుగైన శీతలీకరణ వ్యవస్థలు, ఉత్పత్తి మూలాలను గుర్తించే సాంకేతికత, నాణ్యతా ప్రమాణాల నిబంధనలు రాబోయే కాలంలో ప్రపంచంలోనే అత్యంత విశ్వసనీయమైన, ప్రధానంగా నాణ్యత గల సముద్ర ఉత్పత్తుల ఎగుమతిదారుగా భారత్‌ను నిలబెట్టేందుకు కీలకంగా మారతాయి.

### ఛత్రపతి శివాజీ మహారాజ్ పుణ్యతిథి సందర్భంగా ఆయనకు నివాళులర్పించిన కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4:ఛత్రపతి శివాజీ మహారాజ్ పుణ్యతిథి సందర్భంగా ఆయనకు కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా నివాళులర్పించారు.

సామాజిక మాధ్యమం ఎక్స్ ఖాతాలో శ్రీ అమిత్ షా ఇలా పేర్కొన్నారు.. ""భారతీయ గౌరవానికి అమర చిహ్నంగా, జాతీయ వైభవానికి శాశ్వత సంరక్షకుడిగా నిలిచిన ఛత్రపతి శివాజీ మహారాజ్ పాదలకు నేను భక్తిశ్రద్ధలతో నమస్కరిస్తున్నాను. ధర్మం, సంస్కృతిని కాపాడటం కోసం ఆయన ప్రజలను ఏకం చేసి హిందవీ స్వరాజ్యాన్ని స్థాపించారు. సముద్రాలపై నియంత్రణ ప్రాముఖ్యతను గుర్తించి, ఆయన నిర్మించిన శక్తిమంతమైన నౌకాదళం ఆయన అనవమానమైన వ్యూహాత్మక చతురతకు, దూరదృష్టి గల నాయకత్వానికి నిదర్శనం. ఒక పాలకుడు తన సొంత సంస్కృతిని, భాషను సంరక్షించుకుంటూనే.. ప్రజా సంక్షేమంలో ఆదర్శవంతమైన ప్రమాణాలను ఎలా నెలకొల్పవచ్చో చెప్పడానికి ఆయన జీవితం ఒక గొప్ప ఉదాహరణ. ఆయన అవిశ్రాంత పోరాటం, జీవిత గాథ ఈ దేశ ప్రజలకు మాతృభూమి పట్ల భక్తి, అంకితభావంతో ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తూనే ఉంటాయి."

# ప్రపంచాన్ని ఆకర్షించే అమరావతి కూటమి ప్రభుత్వానికి అభినందనలు

## -రాష్ట్ర వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షులు తిరుపతి శ్రీనివాసరావు.

అమరావతి, ఏప్రిల్ 4: ఆంధ్రప్రదేశ్ గర్వకారణమైన అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దే దిశగా కూటమి ప్రభుత్వం వేస్తున్న అడుగులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నట్లు రాష్ట్ర వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షులు టి ఎస్ఆర్ గ్రూప్ చైర్మన్ తిరుపతి శ్రీనివాసరావు అన్నారు.

అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే పోరాట యోధుడు పవన్ కళ్యాణ్, యువశక్తికి ప్రతీక నారా లోకేష్ కలసి అమరావతిని కేవలం రాజధానిగా కాకుండా ప్రపంచాన్ని ఆకర్షించే అభివృద్ధి చిహ్నంగా తీర్చిదిద్దుతున్నారు అని, అమరావతి అంటే అభివృద్ధి అమరావతి అంటే ఆంధ్రప్రదేశ్ గౌరవం రైతుల త్యాగాలతో నిర్మితమైన ఈ పవిత్ర భూమిని ప్రపంచ పటంలో నిలిపే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది అని తిరుపతి శ్రీనివాసరావు అన్నారు.

ఈ విజన్ విజయవంతమైతే, అమరావతి భారతదేశంలోనే కాదు ప్రపంచంలోనే ఒక ప్రముఖ నగరంగా వెలుగొందుతుంది అని,వడ్డెర సంక్షేమ సంఘం తరపున ఈ మహత్తర నిర్మాణ యజ్ఞానికి మా పూర్తి మద్దతు తెలుపుతూ, అమరావతి అభివృద్ధి మరింత వేగంగా సాగాలని ఆకాంక్షిస్తున్నాము ఆయన అన్నారు.ప్రతి ఒక్కరు కలిసి పనిచేస్తే అమరావతి భవిష్యత్తు మాత్రమే కాదు, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కూడా ప్రకాశవంతమవుతుంది తిరుపతి శ్రీనివాసరావు తెలిపారు.

# జాతీయ జనగణన- 2027లో పాల్గొన్న లోక్‌సభ స్పీకర్ డిజిటల్ సమాచార పత్రాన్ని పూర్తి చేసిన శ్రీ ఓం బిర్లా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4:నేడు లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా ఢిల్లీలోని అధికారిక నివాసంలో 'డిజిటల్ సమాచార పత్రాన్ని' పూర్తి చేయటం ద్వారా జాతీయ జనగణన 2027 తొలి దశలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ జనగణన పరిపాలన వ్యవస్థలో ఒక కొత్త శకానికి నాంది అని పేర్కొన్నారు. భారత చరిత్రలో తొలిసారిగా జనాభా లెక్కింపు ప్రక్రియను పూర్తిగా డిజిటల్ వద్ధతిలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రతి ఒక్కరు తమ ఇంటి వివరాలను అత్యంత సురక్షితంగా ఖచ్చితత్వంతో సులభంగా నమోదు చేసుకునే సదుపాయం దీని ద్వారా లభిస్తుందని ఆయన చెప్పారు.

డిజిటల్ గణన వైపు సాగిన ఈ మార్పు భారతదేశ సాంకేతిక పురోగతికి నిదర్శనమన్న లోక్‌సభ స్పీకర్.. దీనివల్ల జాతీయ గణాంకాలు మరింత ఖచ్చితంగా ఉండటమే కాకుండా అవి క్షేత్ర స్థాయి వాస్తవాలను ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు.

'జనగణన ద్వారా ప్రజా సంక్షేమం' అనే సంకల్పాన్ని పునరుద్ఘాటించిన శ్రీ ఓం బిర్లా.. ఈ కీలకమైన జాతీయ ప్రక్రియలో ప్రజలంతా చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమ వివరాలను నమోదు చేయడమే కాకుండా ఇతరులను కూడా ఇందుకు ప్రోత్సహించాలని.. తద్వారా 'సశక్త్, సమృద్ధ భారత్' (బలమైన, సుసంపన్నమైన భారతదేశం) నిర్మాణానికి పునాది వేయాలని ఆయన కోరారు.

సమాచార పత్రాన్ని లోక్‌సభ స్పీకర్ నింపుతున్నప్పుడు వివరాల నమోదులో ఆయనకు భారత రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ కమిషనర్ శ్రీ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ ప్రత్యక్షంగా సహకరించారు.

# వేసవికాలం వస్తుంది తాగునీటికి ఇబ్బందులు ఉండకూడదు..

**-భూగర్భజలాల పెంపుదలకు 100 రోజుల ప్రత్యేక డ్రైవ్..**
**-జలధార కార్యక్రమంతో నీటి భద్రతపై దృష్టి?**
**-శాస్త్రీయ మ్యాపింగ్‌తో నీటి వనరుల గుర్తింపు..**
**-జిల్లా నుంచి గ్రామ స్థాయికి కమిటీల ఏర్పాటు.**
**-జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా..**

అమరావతి, ఏప్రిల్ 4:జిల్లాలో భూగర్భజలాల స్థాయిని పెంపొందించేందుకు క్షేత్రస్థాయి పరిశీలన, శాస్త్రీయ మ్యాపింగ్, వర్షపు నీటి నిల్వ, కృత్రిమ రీఛార్జ్ చర్యలు మరియు



ప్రజల భాగస్వామ్యంతో కూడిన సమగ్ర ప్రణాళికలను అమలు చేయడం అత్యవసరమని జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో భూగర్భజలాల పెంపుదలపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో "జలధార" కార్యక్రమం మరియు "నీటి భద్రత - సాగునీటి సంఘాల బాధ్యత" అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ఏప్రిల్ 6 నుండి జూలై 14 వరకు 100 రోజుల ప్రత్యేక డ్రైవ్‌గా కార్యక్రమాన్ని అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

హైడ్రోజియోలాజికల్ మ్యాపింగ్ ద్వారా భూగర్భ జలాశయాల స్థితిని అంచనా వేసి, సర్వే నంబర్ల వారీగా నీటి వనరులు, వాగులు, వంకలను ఖచ్చితంగా గుర్తించాలన్నారు. పనుల పురోగతిని ప్రతిరోజూ, ప్రతి వారం ఫోటోలతో సహా నివేదించాలన్నారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలలో కమిటీలను ఏర్పాటు చేసి ఉత్తర్వులు జారీ చేయాలని వాటర్ రిసోర్సెస్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తం 261 సాగునీటి సంఘాలు ఉన్నాయని, వాటి ద్వారా నీటి వినియోగం, నిర్వహణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని తెలిపారు. నియోజకవర్గాల వారీగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ సూచించారు.

డోన్ నియోజకవర్గం పూర్తిగా వర్షాధారిత ప్రాంతం కావడంతో, భూగర్భజలాల స్థాయి పెంపుకు సాంకేతికంగా అనుకూలమైన పనులు చేపట్టాలని చెప్పారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో కాలువల చివరి ప్రాంతం టెయిల్ ఎండ్ కావడంతో, ఉపాధి హామీ పథకం ద్వారా కాలువల పూడికతీత పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భూగర్భజలాల పెంపుదల కోసం చెక్ డ్యామ్‌లు, చెక్ వాల్స్, పర్కోలేషన్ ట్యాంకులు, ఫార్మ్ పాండ్స్, డగౌట్ పాండ్స్, కాంటూర్ ట్రెంచెస్, రాక్ ఫిల్ డ్యామ్స్ వంటి పనులను ప్రాధాన్యంగా చేపట్టాలని తెలిపారు. ఈ పనులకు నాబార్డ్, ఏపిడబ్ల్యూడీ వంటి సంస్థల ద్వారా ఆర్థిక సహకారం పొందే అవకాశముందని పేర్కొన్నారు. సాంకేతికత వినియోగంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ఏపీ డబ్ల్యూ ఆర్ ఎం ఎస్ యాప్ ద్వారా గ్రామ నీటి భద్రతా ప్రణాళికలు, బడ్జెట్లు సిద్ధం చేయాలని సూచించారు. పనులన్నింటినీ జియో ట్యాగింగ్ చేసి, 'బిఫోర్' మరియు 'ఆఫ్టర్' ఫోటోలతో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.

వాటర్ రిసోర్సెస్, అగ్రికల్చర్, హార్టికల్చర్, ఫారెస్ట్, పంచాయతీరాజ్, పబ్లిక్ హెల్త్ వంటి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, మండల స్థాయిలో సాంకేతిక బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి మండలానికి బాధ్యతాయుత అధికారులను నియమించి, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ బలోపేతం చేయాలని చెప్పారు. వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటి సంరక్షణ, పశువులకు నీరు మరియు పచ్చగడ్డి లభ్యత, నీటి కుంటల అభివృద్ధి వంటి అంశాలపై కూడా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఏప్రిల్ 16 నుండి 20 తేదీల మధ్య పనులకు సంబంధించిన అన్ని అనుమతులను పూర్తిచేసి, అనంతరం ఏప్రిల్ 21 నుండి జూలై 9 వరకు చేపట్టిన పనులన్నీ పూర్తి చేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు.

నిధుల వినియోగంలో పారదర్శకత పాటిస్తూ, జల్ శక్తి అభియాన్, ఉపాధి హామీ పథకం వంటి పథకాల నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. అన్ని శాఖల సమిష్టి కృషితో భూగర్భజలాల పెంపుదల సాధ్యమవుతుందని, దీని ద్వారా రైతులకు, గ్రామీణ ప్రాంతాలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో వలువురు జిల్లాస్థాయి అధికారులు నున్న వెంకటేశ్వర్లు సుధాకర రావు, గ్రౌండ్ వాటర్ డిపార్ట్మెంట్ ఆర్డబ్ల్యూఎస్ సంబంధించిన శాఖ పాల్గొన్నారు.

# ప్రజల చిరకాల కోరిక సాకారం చేసిన ఎమ్మెల్యే..



అమరావతి, ఏప్రిల్ 4:చెరువులు ఊరి ఉమ్మడి ఆస్తులని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత గ్రామస్తులందరి పైన ఉందని ఏపీ ప్రభుత్వ విప్ గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. శనివారం బాపులపాడు మండలం అంపాపురం గ్రామంలో గత 14 ఏళ్లుగా పూడికతో నిండిపోయి నిరుపయోగంగా మారిన అంపాపురం కోడి కాలవ పునరుద్ధరణ పనులను ఆయన స్థానిక నాయకులు, రైతులతో కలిసి స్వయంగా పరిశీలించారు.

ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను పరిష్కరించినందుకు గ్రామ ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఏలూరు కాలవ నుంచి గ్రామంలోని మూడు ప్రధాన చెరువులకు నీటిని అందించే ఈ కోడి కాలవ 14 సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురైంది. స్థానికులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగానే ఆయన వెంటనే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంతేకాక, ఎమ్మెల్యే తన సొంత నిధులతో గతంలో అందించిన మూడు మోటార్ల సహాయంతో నీటిని లిఫ్ట్ చేసి నేరుగా చెరువులు నిండేలా చర్యలు తీసుకుంటున్నారు.గతంలో ఆక్రమణలకు గురైన చెరువులను స్వయంగా పర్యవేక్షిస్తూ బాగు చేయించి అభివృద్ధి చేయడమే కాకుండా, త్వరలో ఈ చెరువుల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అలానే ఎక్కడెక్కడ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలో చూసి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 14 ఏళ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు గ్రామస్తులు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ పార్టీ అధ్యక్షుల సుంకర రాజా వేణు గోపాల్, బాపులపాడు మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు వలివేటి కిషోర్, టీడీపీ నాయకులు అల్లంశెట్టి శ్రీమన్నారాయణ, కోడె రేవంత్ ,యాళ్ళ శ్రీధర్, కోడె శ్రీనివాసరావు, దండుబోయిన రాంపండు, పుట్టి నాగరాజు, అల్లంశెట్టి శేషు, మోతుకూరి మాణిక్యాలరావు గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# టిటిడి చైర్మన్ పదవి నుంచి తక్షణమే తొలగించాలి..

## –డాక్టర్ గోపిరెడ్డి డిమాండ్

అమరావతి, ఏప్రిల్ 4:పల్నాడు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడును తక్షణమే ఆ పదవి నుంచి తొలగించాలని స్థానిక బరంపేట లోని శ్రీ లీలా వెంకటేశ్వర స్వామి వారి దేవాలయం వద్ద వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి 101 కొబ్బరికాయలు కొట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం గోపిరెడ్డి నివాసం నుండి బరంపేటలో వేంచేసి యున్న శ్రీలీలా వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం వరకు గోపిరెడ్డి పార్టీ కార్యకర్తలతో కలిసి ద్విచక్ర వాహనాలపై ర్యాలీ నిర్వహించారు. టీటీడీ చైర్మన్ బి ఆర్ నాయుడు ని తక్షణమే ఆ పదవి నుంచి తొలగించాలని స్వామివారిని ప్రార్థించారు.



ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ గా బి ఆర్ నాయుడు నియమితులైన తర్వాత వరుసగా అపవిత్ర సంఘటనలు జరుగుతున్నాయని గోపిరెడ్డి అన్నారు. 30 ఏళ్ల నుంచి ఒక భార్య కాని మహిళ తో సహజీవనం చేస్తున్న వ్యక్తిని టీటీడీ చైర్మన్గా ఏ విధంగా కొనసాగించారని కూట మి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

ఇది చాలా తప్పుడు సాంప్రదాయమని ,ఇటువంటి వ్యక్తిని నియమించటం వల్ల వరుసగా దేవస్థానం అపవిత్ర మవుతుందని, పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను కాపాడాలంటే తక్షణ మే బిఆర్ నాయుడుని తొలగిం చాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

బిఆర్ నాయుడు లాంటి అపవిత్ర వ్యక్తులకు పవిత్రమైన టి టి డి చైర్మన్ స్థానంలో కూర్చోవడానికి అర్హత లేదని, దేవస్థానం మలినం అవుతుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొన్న వారి మనవడి పుట్టిన రోజు వేడుకలకు తిరుపతి వెళ్ళినప్పుడు బిఆర్ నాయుడుని వెంటబెట్టుకొని దేవస్థానం క్యూలైన్లు, పరిసర ప్రాంతాలన్నీ వి ఆర్ నాయుడు ను వెంటబెట్టుకుని తిరిగారని దాని వల్ల ఆయనకు కూడా చెడ్డ పేరు వస్తుందని ,దేవస్థానం పవిత్రతను మంట కలిపిన బిఆర్ నాయుడుని తక్షణమే టిటిడి చైర్మన్ పదవి నుంచి తొలగించి, ఎటువంటి దురలవాట్లు లేని, దేవస్థానం పవిత్రత కాపాడే మంచి వ్యక్తిని ఈ పదవిలో నియమించాలని వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజముద్ర పట్టాదారు పాసుపుస్తకాలతో రైతన్నలకు భరోసా

**–మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్**

**–కొటికలపూడిలో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ**

ఇబ్రహీంపట్నం,ఏప్రిల్ 4:ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టు ద్వారా రీసర్వే పూర్తయిన గ్రామాల్లో నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కొటికలపూడిలో పట్టాదారు పాసు పుస్తకాలను ఎమ్మెల్యే వసంత శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పబ్లిసిటీ పిచ్చితో పట్టాదారు పాసు పుస్తకాలపై జగన్ ఫొటో వేశారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం రాజముద్రతో ఉన్న కొత్త పట్టాదారు పాసు పుస్తకా లను పంపిణీ చేస్తోందన్నారు.

తప్పులను సరిదిద్ది భూ వివాదాలు లేకుండా చేయడమే తమ ప్రభుత్వ కర్తవ్యం అని వివరించారు. పట్టాదారు పాస్ పుస్తకాల కోసం ఒకప్పుడు రైతులే అధికారులు చుట్టూ తిరిగేవారని, పాస్ పుస్తకం వస్తే రైతులకు అదో వరమన్నారు. ప్రజా ప్రతినిధులు సైతం ప్రభుత్వం వద్ద సంప్రదింపులు జరిపి పాస్ పుస్తకాలు మంజూ రు చేసేలా గట్టి ప్రయత్నాలు చేసేవారని గుర్తు చేశారు. అలాంటిది ఇప్పుడు అధికారులే పట్టాదారు పుస్తకాలు ఇస్తామంటూ రైతులు చుట్టూ తిరుగుతున్నారని, ఈకేవైసీ చేస్తున్నారన్నారు.

కూటమి ప్రభుత్వ పారదర్శక పాలనకు ఇది నిదర్శనమన్నారు. ఈ కమంలో ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, వైస్ ఎంపీపీ బండి నాగమణి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన చిట్టిబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, జనసేన పార్టీ మైలవరం నియోజకవర్గ ఇన్ చార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# భారతదేశ నౌకా నిర్మాణ రంగంలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించటానికి కేఓఐసీఏతో ఎంఓపీఎస్‌డబ్ల్యూ ఒప్పందం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4:భారత సముద్ర రంగ సామర్థ్యాలను బలోపేతం చేసేందుకు కీలక ముందడుగులో భాగంగా కొరియా అంతర్జాతీయ సహకార సంస్థ (కేఓఐసీఏ)తో ఓడరేవులు, నౌకాయాన, జలమార్గాల మంత్రిత్వ శాఖ (ఎంఓపీఎస్‌డబ్ల్యూ) ఏప్రిల్ 02, 2026న ప్రతిష్ఠాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. భారత నౌకా నిర్మాణ రంగంలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందిచేందుకు ఈ ఒప్పందం.

మారిటైమ్ అమృత్ కాల్ విజన్-2047 ద్వారా నిర్దేశించిన ప్రతిష్ఠాత్మక లక్ష్యాలకు అనుగుణంగా.. 'భారతదేశ నౌకా నిర్మాణ, సముద్ర రంగం కోసం అభివృద్ధి వ్యూహాలను రూపొందించటం, నైపుణ్యం, వృత్తి నైపుణ్యాలు గల ప్రతిభావంతులను తయారుచేయటం' అనే ప్రాజెక్టు పేరుతో భారత ఆర్థిక వృద్ధికి, ప్రపంచ సముద్ర రంగంలో నౌకా నిర్మాణ రంగాన్ని వ్యూహాత్మకంగా కీలకమైన రంగంగా నిలబెట్టటమే లక్ష్యంగా పెట్టుకుంది.

ఈ ఒప్పందంలో భాగంగా కేఓఐసీఏ, కొరియా రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్, ఇతర భాగస్వాముల మద్దతుతో భారత నౌకా నిర్మాణం, మెరైన్ ఇంజినీరింగ్ రంగాలపై సమగ్రమైన పరిశోధనను చేపట్టనుంది. ఈ కార్యక్రమం ప్రస్తుత సిబ్బంది నైపుణ్యాలను గుర్తించటం, నైపుణ్య లోపాల అంచనా, మానవ వనరుల అభివృద్ధికి పటిష్ఠమైన ప్రణాళికను, తగిన కార్యాచరణను రూపొం దించటంపై దృష్టి సారిస్తుంది.

ఈ ఒప్పందంపై ఓడరేవులు, నౌకాయాన, జలమార్గాల శాఖ మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ మాట్లాడుతూ.. "భారతదేశ సముద్రయాన ప్రయాణంలో ఈ భాగస్వామ్యం కీలకఘట్టం. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రపంచస్థాయి పోటీని తట్టుకోగల నౌకా నిర్మాణ వ్యవస్థను అభివృద్ధి చేసే దిశగా మనం అడుగులు వేస్తున్నాం. గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో సముద్రయాన రంగాన్ని ఆర్థిక వృద్ధికి, వ్యూహాత్మక పటిష్టతకు కీలక శక్తిగా భారత్ మారుస్తోంది. ప్రపంచ నౌకా నిర్మాణ కేంద్రంగా భారత్ ఎదగటానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం గల నవతరం నిపుణులను తీర్చిదిద్దడమే ఈ సహకార ముఖ్య ఉద్దేశం. మారిటైమ్ అమృత్ కాల్ విజన్-2047 జాతీయ ప్రాధాన్యతలతో దక్షిణ కొరియా అధునాతన నైపుణ్యాన్ని అనుసంధానించటం ద్వారా శరవేగంగా మారుతున్న ప్రపంచ సముద్ర రంగ అవసరాలకు అనుగుణంగా శ్రామిక శక్తిని వేం సిద్ధం చేస్తున్నాం. ఈ కార్యక్రమం సంస్థాగత సామర్థ్యాన్ని బలోపేతం చేస్తుంది. ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుంది. ముఖ్యంగా మన యువతకు నాణ్యమైన ఉపాధి అవకాశాలను కల్పిస్తుంది. పటిష్ఠమైన, భవిష్యత్ అవసరాలకు తగినట్లుగా, ప్రపంచవ్యాప్తంగా గౌరవించే ఆత్మనిర్భర్ సముద్ర రంగాన్ని నిర్మించాలనే మా నిబద్ధతను స్పష్టం చేస్తుంది"

ఈ ప్రాజెక్టులో భాగంగా భారత్, దక్షిణ కొరియా దేశాల్లో కార్మిక శక్తి అభివృద్ధిపై ద్వైపాక్షిక సదస్సులను నిర్వహించాలని నిర్ణయించారు. ఉత్తమ పని విధానాలను పరస్పరం పంచుకోవటానికి, సహకారాన్ని మరింత బలోపేతం చేయటానికి ఈ సదస్సులు కీలక భాగస్వాములను, పరిశ్రమల అధినేతలను, విధాన రూపకర్తలను, విద్యా రంగ నిపుణులను ఒకచోట చేర్చుతుంది.

ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన కొరియా సాంకేతిక నైపుణ్యాన్ని, అనుభవాన్ని ఉపయోగించుకోవటం ద్వారా భారతదేశపు నౌకా నిర్మాణ, సముద్ర రంగాల పురోగతికి ఈ భాగస్వామ్యం గణనీయంగా దోహదపడుతుంది.

ఇది కార్మిక శక్తి విశ్లేషణను సులభతరం చేయడమే కాక, సంస్థాగత సామర్థ్యాన్ని పెంచుతుంది.

అత్యున్నత నైపుణ్యం గల, భవిష్యత్ సవాళ్లను ఎదుర్కోగల సముద్ర యాన కార్మిక శక్తిని అభివృద్ధి చేసే లక్ష్యంతో నిర్మాణాత్మక శిక్షణా కార్యక్రమాల రూపకల్పనకు మద్దతునిస్తుంది.

ఈ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తూ భారతదేశంలో 'నౌకా నిర్మాణ రంగ శ్రామిక శక్తి అభివృద్ధి, సాంకేతిక సహకార కేంద్రం' ఏర్పాటునకు సంబంధించి ఎంఓపీఎస్‌డబ్ల్యూ, కేఓఐసీఏ మధ్య తుది చర్చలు జరుగుతున్నాయి. ఈ ప్రతిపాదిత కేంద్రం పరిశ్రమ అవసరాలకు తగిన వృత్తి విద్యా శిక్షణను అందించటం, సాంకేతిక సామర్థ్యాలను మెరుగుపరచటం, నౌకా నిర్మాణ రంగానికి అవసరమైన అధునాతన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా ఉత్పాదకతను పెంచటంపై దృష్టి సారిస్తుంది.

నౌకా తయారీ, సముద్రయాన సేవల్లో భారతదేశాన్ని గ్లోబల్ హబ్‌గా మార్చే దిశగా ఈ ప్రయత్నం కీలక ఘట్టం.

సామర్థ్య పెంపు, అంతర్జాతీయ సహకారం, స్థిరమైన సముద్రయాన వృద్ధి పట్ల ప్రభుత్వానికున్న నిబద్ధతను ఇది మరింత బలోపేతం చేస్తుంది.

# ప్రతి ఇంట్లో సూర్యఘర్ వెలుగులు నింపుదాం..

**–పీఎం సూర్యఘర్ పై ప్రజల్లో అవగాహన పెంచాలి**

**–సూర్యాంధ్ర ప్రగతి శకటాలతో జనజాగృతికి శ్రీకారం**

**–మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్**

**–కేతనకొండలో సౌర విద్యుత్ కనెక్షన్లు ప్రారంభించిన ఎమ్మెల్యే**

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 4: సౌరశక్తి వినియోగంపై ప్రజలను ప్రోత్సహిస్తూ ప్రతి ఇంట్లో సూర్యఘర్ వెలుగులు నింపుదామని, పీఎం సూర్యఘర్



పథకంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు సూర్యాంధ్ర ప్రగతి శకటాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా కేతనకొండలో వలు గృహాలపై అమర్చిన సౌర విద్యుత్ ఫలకాలను ఎమ్మెల్యే శనివారం పరిశీలించారు. నేషనల్ సోలార్ ఎనర్జీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఈఎఫ్ఐ) – సూర్యాంధ్ర ప్రగతి రథ శకటాన్ని జెండా ఊపి ప్రారంభించారు.

పలువురు లబ్ధిదారులు ఇళ్లకు అమర్చిన నూతన సోలార్ విద్యుత్ కనెక్షన్లను ప్రారంభించారు. వారితో మాట్లాడి సౌరవిద్యుత్ వల్ల కలిగే లాభాలను వివరించారు. ఈ సందర్భంగా వినియోగదారులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సూర్య ఘర్ యోజన పథకంతో విద్యుత్ బిల్లుల నుంచి విముక్తి లభించడంతో పాటు పర్యావరణ హితానికి ఈ పథకం దోహదం చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేయూతతో అమల్లో ఉన్న పీఎం సూర్యఘర్ – ముఫ్త్ బిజ్లీ యోజన పథకం ద్వారా 60 శాతం వరకు రాయితీతో సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకొని విద్యుత్ వినియోగదారులు ఉత్పత్తిదారులుగా మారొచ్చన్నారు.

ఇంటి అవసరాలకు ఉపయోగించుకోగా మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అమ్మడం ద్వారా అదనపు ఆదాయం కూడా పొందవచ్చని చెప్పారు. విద్యుత్ స్వయం సమృద్ధితో విద్యుత్ కొనుగోలుపై ఆధారపడాల్సిన అవసరం లేదన్నారు. ఇంటి యజమానులు, అపార్టుమెంట్లు, హౌసింగ్ సొసైటీలు, చిన్న, మధ్య తరహా వ్యాపారస్తులు, రైతులు పథకానికి అర్హులని వివరించారు. పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించేందుకు ఎన్ఎస్ఈఎఫ్ఐ – సూర్యాంధ్ర ప్రగతి రథాల ద్వారా గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ఈ రథం ద్వారా పీఎం సూర్యఘర్ పథకం ప్రయోజనాలు, దరఖాస్తు విధానం, సబ్సిడీ వివరాలు ప్రజలకు తెలియజేస్తున్నట్లు వివరించారు. ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన చిట్టిబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, జనసేన పార్టీ మైలవరం నియోజకవర్గ ఇన్ చార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), టీడీపీ మండల అధ్యక్షుడు పెదర్ల రవి తదితరులు పాల్గొన్నారు.

# కోదాడ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



నల్గొండ, ఏప్రిల్ 4:కోదాడ బార్ అసోసియేషన్ కు నూతనంగా ఎన్నికైన కార్యవర్గంచే శనివారం కోర్టు ఆవరణలో ఎన్నికల అధికారి పాలేటి నాగేశ్వరరావు, సహాయ అధికారి మాధవరపు రామకృష్ణ ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడు– చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షుడు– గట్ల నరసింహారావు, ప్రధాన కార్యదర్శి– రామిశెట్టి రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి– షేక్ జాని పాషా, లైబ్రరీ సెక్రటరీ– గాలి శ్రీనివాస నాయు డు, కోశాధికారి– కోడూరు వెంకటేశ్వరరావు, క్రీడలు ఓ సాంస్కృతిక కార్యదర్శి– వెంకటా చలం, మహిళా ప్రతినిధి– వి. ధనలక్ష్మి, ఈసీ సభ్యులుగా షేక్ రంజాన్ బాషా, టి.సీతారావ ంరాజు, బి.దుర్గ, పి.హేమలత, షేక్ నాగుల్ పాషా, పి.హనుమంతరావు, బి.శ్రీనివాసరావు, సి.హెచ్.పెద్దబ్బాయ్ ప్రమాణ స్వీకారం చేశారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిలివేరు వెంకటేశ్వర్లు, పలువురు న్యాయవాదులు నూతన కార్యవర్గాన్ని శాలువా, పూల బొకేలతో అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన కోర్టు భవనం త్వరితగతిన పూర్తయ్యే విధంగా కృషి చేయడంతో పాటు న్యాయవాదుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.

# క్రీడలతో శారీరక, మానసిక ధృఢత్వం : ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం, ఏప్రిల్ 4: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. శనివారం ప్రగతి మైదానంలో గాయత్రి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల వల్ల శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందని యువతను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే క్రీడా మైదానాల అభివృద్ధి జరిగిందన్నారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందన్నారు.

కాంగ్రెస్ పార్టీ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను యువత ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. యువతతో కలిసి ఎంపీ మైదానంలో క్రికెట్ ఆడి ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాకేష్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, మున్సిపల్ మాజీ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి, చుంచుపల్లి మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి, బీఆర్ఎస్ నాయకులు వనమా రాఘవేంద్రరావు, కార్పొరేటర్లు సింధు తపస్వి, సాగర్, సర్పంచులు శ్రీకాంత్, జయరాం, నాయకులు శ్రీకాంత్, రమాకాంత్, బి.శ్రీనివాస్, కన్ని రాజేష్, మిట్టపల్లి కిరణ్ పాల్గొన్నారు.

# డోర్నకల్- భద్రాచలం రైల్వేలైన్ భూసేకరణపై కలెక్టరేట్‌లో సమావేశం

**–ఎకరానికి రూ.19 లక్షలు, గజానికి రూ.6,300 ఇస్తామన్న అధికారులు**

**–10 శాతం అయినా పెంచాలని ప్రాధేయపడ్డ నిర్వాసితులు**

**–జేసీ, ఎస్డీఎల్ సీ తో ఫోన్ లో మాట్లాడిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్**

**–మరో సమావేశంలో రేటు ఫైనల్ చేద్దామని అధికారులతో చెప్పిన ఎమ్మెల్యే**

ఖమ్మం, ఏప్రిల్ 4: డోర్నకల్ - భద్రాచలం రోడ్ రైల్వే లైన్ డబ్లింగ్ పనుల కోసం భూ సేకరణ చేసిన భూములకు రేటు విషయంలో చర్చించేందుకు ఖమ్మం జిల్లా భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి సింగరేణి గ్రామానికి చెందిన భూ నిర్వాసితులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఖమ్మం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ నిర్ణయించిన రేటును స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రకటించారు. వ్యవసాయ భూమికి ఎకరానికి రూ.19 లక్షలు, ఇళ్ల స్థలాలకు గజానికి రూ.6,300 చెల్లిస్తామని స్పష్టం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల భూ సేకరణలో చెల్లించిన రేట్లనే చెల్లిస్తామని అధికారులు పేర్కొనడంతో దానికి నిర్వాసితులు అంగీకరించలేదు. నాన్ ఏజెన్సీ విషయంలో అక్కడి భూముల ధరలను కూడా పరిగణలోకి తీసుకుని మానవతా దృక్పథంతో న్యాయం చేయాలని బాధితులు కోరారు. 10 శాతం అయినా పెంచాలని భూ నిర్వాసితులు ప్రాధేయపడ్డారు. రెండోసారి ఏర్పాటు చేసిన సమావేశంలో కూడా పరిహారం పెంచడంలో అధికారులు నిర్ణయం తీసుకోకపోవడంతో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సమక్షంలో మరోసారి సమావేశం ఏర్పాటు చేయడానికి అవకాశం కల్పించమని నిర్వాసితులు కోరారు. వారం రోజుల లోపలనే మరోసారి ఏర్పాటు చేసే సమావేశం నాటికి ఆలోచించుకుని నిర్ణయం తెలపాలని అధికారులు పేర్కొన్నారు.

అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్

కలెక్టరేట్ లో శనివారం భూ నిర్వాసితులతో ఏర్పాటు చేసిన సమావేశానికి వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సిద్ధమయ్యారు. కానీ అత్యవసర పనుల వల్ల కలెక్టర్, జేసీ సమావేశానికి రావడం లేదని తెలపడంతో ఎమ్మెల్యే ఫోన్‌లో జేసీ శ్రీనివాస్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి తో మాట్లాడారు. రైతులు, ఇళ్లు కోల్పోయిన వారికి న్యాయమైన పరిహారం అందించాలని కోరారు. మరో సమావేశానికి తాను తప్పనిసరిగా హాజరవుతానని అధికారులు, భూ నిర్వాసితులతో చర్చించి ఆ సమావేశంలో రేటు ఫైనల్ చేద్దామని ఎమ్మెల్యే తెలిపారు.

# పింఛన్ డబ్బుల కోసం వృద్ధుల రాస్తారోకో.. నిలిచిపోయిన ట్రాఫిక్

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 4:వారం రోజులుగా పోస్ట్ ఆఫీస్ చుట్టూ తిరుగుతున్న తమకు పింఛన్ డబ్బులు ఇవ్వడం లేదని ఆరోపిస్తూ నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం కంసాన్ పల్లి గ్రామానికి చెందిన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు మండల కేంద్రంలో రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు.

హైదరాబాద్ నారాయణపేట ప్రాంతాలకు వెళ్తున్న బస్సులను అడ్డుకొని నిరసన తెలిపారు. వరలక్ష్మి అనే మహిళ పింఛను ఇచ్చేంత వరకు కదిలేది లేదని బస్సు ఎదుట బైటాయించింది. విషయం తెలుసుకున్న ఏఎస్సై ముస్తాక్ అలీ సంఘటన స్థలానికి చేరుకొని రాస్తారోకో విరమించాలని కోరారు.

పెన్షన్‌దారులను బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ వద్దకు తీసుకువెళ్లి మాట్లాడించారు.

ఎందుకు పెన్షన్ ఇవ్వడం లేదంటూ ఆరా తీశారు

కంసాన్‌పల్లి గ్రామస్తులు మాట్లాడుతూ ప్రతినెలా తమ గ్రామానికి వచ్చి పింఛన్లు ఇచ్చేవారని, కాని కొన్ని నెలలుగా తాము మూడు కిలోమీటర్లు నడుచుకుంటూ వచ్చి పోస్ట్ ఆఫీస్ చుట్టూ తిరుగుతున్నా పింఛన్లు ఇవ్వడం లేదని పోలీసులతోనూ పోస్ట్ మాస్టర్‌తోనూ వాగ్వాదానికి దిగారు.

పోస్ట్ మాస్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పది రోజుల నుంచి పింఛన్లు పంపిణీ చేస్తున్నామని 60 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేశామని నగదు కొరత వల్ల ఇంకా 40 శాతం మందికి పెన్షన్లు ఇవ్వలేదని వివరించారు.

# బీబీనగర్ పీహెచ్‌సీలో కిశోర బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్



నల్గొండ, ఏప్రిల్ 4:బీబీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం 14 సంవత్సరాల కిశోర బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కిశోర బాలికల్లో గర్భాశయ క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ టీకా ఎంతో ఉపయోగకరమని తెలిపారు. 14 సంవత్సరాల వయస్సులో ఈ టీకా వేయించుకోవడం ద్వారా భవిష్యత్‌లో గర్భాశయ క్యాన్సర్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చన్నారు. అర్హత కలిగిన ప్రతి బాలిక ఈ టీకాను తప్పనిసరిగా తీసుకోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను టీకా కార్యక్రమానికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పావని, సూపర్‌వైజర్లు శాంతాకుమారి, ప్రభాకర్, ఎంపీహెచ్ఏ వసంత, కవిత, డీఈఓ శ్రీదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# నిరాహార దీక్ష విరమింపజేసిన డీసీసీ అధ్యక్షుడు రామకృష్ణ..




నిజామాబాద్, ఏప్రిల్ 4:కాంగ్రెస్ పార్టీలో అన్ని వర్గాల వారికి సమాన న్యాయం జరుగుతుందని నగర కార్పొరేషన్ డీసీసీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ తెలిపారు. పార్టీ కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి తగిన ప్రాధాన్యం తప్పకుండా లభిస్తుందని అన్నారు.

మాజీ మేయర్ ధర్మపురి సంజయ్‌కు అన్యాయం జరుగుతుందనే ఆరోపణలతో ఆయన అభిమానులు గాంధీ చౌక్‌లో చేపట్టిన నిరాహార దీక్షను రామకృష్ణ సందర్శించి, వారితో మాట్లాడి దీక్షను విరమింపజేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలో మున్నూరు కాపులకు అన్యాయం జరుగుతుందనే భావన సరైంది కాదన్నారు. నిజామాబాద్ నగర డీసీసీ అధ్యక్షుడిగా తనకు అవకాశం ఇవ్వడం, రాష్ట్ర స్థాయిలో రాంభూపాల్‌కు ప్రధాన కార్యదర్శి పదవి ఇవ్వడం, ఇటీవల కార్పొరేషన్ ఎన్నికల్లో 10 కార్పొరేటర్ స్థానాలు మున్నూరు కాపులకు కేటాయించడం వంటి ఉదాహరణలు ఇచ్చారు.

అలాగే, రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులతో పాటు నామినేటెడ్ పోస్టులు, యువజన కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ వంటి కీలక పదవులు కూడా మున్నూరు కాపులకు ఇవ్వబడినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా అవసరాన్ని బట్టి మరిన్ని అవకాశాలు కల్పిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

పార్టీకి అనుగుణంగా కలిసికట్టుగా పనిచేయాలని, వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ముందుకు సాగుతూ, రాబోయే ఎన్నికల్లో నిజామాబాద్ అర్బన్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేను గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్

నల్గొండ, ఏప్రిల్ 4: కాంగ్రెస్ సర్కార్ పాలనలో నిత్యం ఏదో ఒక చోట ఫుడ్ పాయిజన్ ఘటనలు వెలుగుచూస్తూనే ఉన్నాయి. ఇప్పటికే పలు జిల్లాల్లోని గురుకులాలు, హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్ జరిగిన ఘటనలు చాలా జరిగాయని తెలిసిందే. తాజాగా ఓ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరిగింది. ఈ ఘటనలో ఆరుగురు విద్యార్థులతోపాటు ఓ ఉపాధ్యాయుడు అస్వస్థతకు లోనయ్యారు.

కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలం ఎల్లూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ బారిన పడి ఆరుగురు విద్యార్థులు, ఉపాధ్యాయుడు అస్వస్థతకు గురై వాంతులు, విరోచనాలు అయ్యాయి. దీంతో విద్యార్థులతోపాటు, ఉపాధ్యాయుడిని కూడా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# నిర్లక్ష్యపు ధోరణి సహించను.. కాంట్రాక్టర్లపై చంద్రబాబు సీరియస్..

అమరావతి, ఏప్రిల్ 4:రాజధాని అమరావతి పనుల్లో జాప్యం చేస్తున్న కాంట్రాక్ట్ సంస్థల తీరుపై ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి నిర్మాణాలు పూర్తి చేసి తీరాల్సిందే అని ఆదేశాలు జారీ చేశారు. రాజధాని నిర్మాణ పనులపై సీఎం చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నిర్మాణాలు చేస్తున్న కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు, పలువురు అధికారులపై ఆయన సీరియస్ అయ్యారు. రాజధాని నిర్మాణానికి ఇసుక, గ్రావెల్ సరఫరాలో ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆజ్ఞాపించారు.

ఇసుక, గ్రావెల్ కొరతతో నిర్మాణ పనుల్లో జాప్యం జరగకూడదని సీఎం చంద్రబాబు చెప్పారు. అయితే, కృష్ణాజిల్లా అటవీ శాఖ అధికారుల వల్లే గ్రావెల్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ముఖ్యమంత్రి దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. అటవీ అధికారులతోనే అసలు సమస్య వస్తోందన్నారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా అటవీశాఖ అధికారుల తీరుపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధానికి అవసరమైన ఇసుక, గ్రావెల్ గ్రీన్ ఛానెల్ ద్వారా వెళ్లాలని ఆదేశించారు. మెటీరియల్ సరఫరాలో ఎవరి ఒత్తిళ్లకూ లొంగొద్దని హుకుం జారీ చేశారు. ఎవరైనా ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

రాజధాని అమరావతి నిర్మాణ ప్రాంతాల్లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాలపైనా సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఈ సందర్భంగా నిర్మాణ సంస్థల తీరును తప్పుపట్టారు. నిర్మాణ సామగ్రికి రక్షణ కల్పించే బాధ్యత కాంట్రాక్ట్ సంస్థలకు లేదా అంటూ ఆయన ప్రశ్నించారు. కాంట్రాక్ట్ సంస్థల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వంపై విమర్శలు వస్తున్నాయని ఆగ్రహించారు. ఘటన తర్వాత కూడా కాంట్రాక్ట్ సంస్థలు, అధికారులు సరిగా స్పందించలేదని మండిపడ్డారు. ప్రతి అంశాన్నీ వక్రీకరించేలా కొందరు రాజకీయాలు చేస్తున్నారని.. ఇలాంటి పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలి కదా.. అంటూ సున్నితంగా హెచ్చరించారు.

జరగరాని ఘటనలు జరిగితే వెంటనే అలర్ట్ చేయాల్సిన బాధ్యత లేదా? అంటూ కాంట్రాక్ట్ సంస్థలను చంద్రబాబు ప్రశ్నించారు. ప్రభుత్వంపై బురద జల్లేందుకు కొందరు సిద్ధంగా ఉన్నారన్నారు. నిర్మాణ సంస్థలు సమర్థులైన ప్రాజెక్ట్ మేనేజర్లను నియమించుకోవాలన్నారు. అలా చేయకుంటే ఆ ప్రభావం ప్రభుత్వంపై పడుతుందన్నారు సీఎం. ఇలాంటి నిర్లక్ష్యపు ధోరణిని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించమని సీఎం చంద్రబాబు వారికి తేల్చి చెప్పారు.

# ఘనంగా పుల్ల మల్లయ్య జన్మదిన వేడుకలు,



చిట్యాల, ఏప్రిల్ 4: మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య జన్మదిన వేడుకలు, కేక్ కట్ చేసి ,స్వీట్లు, పంపిణీ చేసి ఏ వైయస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మండల సాంస్కృతిక కార్యదర్శి దాసరపు నరేష్, మండల ఉపాధ్యక్షులు దూడపాక సరోత్తం, మండల ప్రచార కార్యదర్శి కట్కూరి రాజు, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కోశాధికారి శీలపాక నాగరాజు, మండల ఉపాధ్యక్షులు పుల్ల అశోక్ ,కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు అల్లకొండ కుమార్, మిట్టపల్లి మిత్ర మండలి అధ్యక్షుడు పుల్ల సతీష్ కుమార్, గుర్రపు రాజమౌళి, కాటూరి శ్రీనివాస్, అంబేద్కర్ వాదులు కండే రమేష్, పుల్ల చందు, మాదిగ జాగృతి మండల అధ్యక్షుడు నదునూరి రాజు ,తదితరులు పాల్గొన్నారు.

# బీహార్ గొప్ప ఆలోచనలకు, పరివర్తన ఉద్యమాలకు నెలవు: ఉపరాష్ట్రపతి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 4:భారత ఉపరాష్ట్రపతి శ్రీ సి. పి. రాధాకృష్ణన్, ఈరోజు బీహార్‌లోని తూర్పు చంపారన్‌లోని మోతిహారిలో జరిగిన మహాత్మా గాంధీ సెంట్రల్ యూనివర్సిటీ 3వ స్నాతకోత్సవ కార్యక్రమంలో ప్రసంగించారు.

భారత చరిత్రలో చంపారన్‌కు ఒక ప్రత్యేక స్థానం ఉందని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. ఎందుకంటే, ఇక్కడే మహాత్మా గాంధీ ఒక బారిస్టర్ నుండి భారతదేశంలోని గ్రామాలలో పాతుకుపోయిన ప్రజా నాయకుడిగా రూపాంతరం చెందారని, మరియు చంపారన్ సత్యాగ్రహం సత్యం, ధైర్యం మరియు న్యాయం ద్వారా దేశ మనస్సాక్షిని మేల్కొల్పిందని ఆయన అన్నారు.

బీహార్ యొక్క గొప్ప మేధో మరియు ఆధ్యాత్మిక వారసత్వాన్ని హైలైట్ చేస్తూ, ఈ పవిత్ర భూమిలోనే గౌతమ బుద్ధుడు జ్ఞానోదయం పొందారని, ప్రాచీన నలంద విశ్వవిద్యాలయం ప్రపంచ విజ్ఞానానికి ఒక మార్గదర్శిగా నిలిచిందని, మరియు చాణక్యుడి వంటి మహానీయులు ఆవిర్భవించారని ఉపరాష్ట్రపతి అన్నారు.

మహాత్మా గాంధీ సెంట్రల్ యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టడం అనేది గాంధీజీ యొక్క సామాజిక న్యాయం, గ్రామీణాభివృద్ధి మరియు నైతిక నాయకత్వ ఆదర్శాల పట్ల నిబద్ధతను ప్రతిబింబించే ఒక ప్రగాఢమైన ప్రతీకాత్మక చర్య అని ఉపరాష్ట్రపతి అన్నారు. ఈ ప్రాంతంలో విద్యాసంస్థల స్థాపనలో మహారాణి జానకి కున్వర్ యొక్క దాతృత్వం మరియు భూదానం కీలక పాత్ర పోషించాయని ఆయన గుర్తుచేసుకున్నారు. అటువంటి దూరదృష్టితో కూడిన ఉదారత విద్య మరియు సామాజిక ప్రగతికి పునాదిని బలపరుస్తుందని ఆయన అన్నారు.

యూనివర్సిటీ జాతీయ విద్యా విధానం 2020ని అమలు చేసి, కొత్త సమీకృత కోర్సులను ప్రవేశపెట్టడం పట్ల ఉపరాష్ట్రపతి సంతోషం వ్యక్తం చేశారు. ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్ సెంటర్ ఏర్పాటును, అలాగే ఫిట్ ఇండియా ఉద్యమం కింద క్రీడలు మరియు ఫిట్‌నెస్‌కు యూనివర్సిటీ ఇస్తున్న ప్రాధాన్యతను ఆయన అభినందించారు. అండర్ గ్రాడ్యుయేట్ మరియు పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లలో యూనివర్సిటీ టాపర్లు మహిళా విద్యార్థులే కావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఇది దేశంలో మహిళా నేతృత్వంలోని అభివృద్ధి పురోగతికి నిదర్శనమని ఆయన అభివర్ణించారు.

పట్టభద్రులైన విద్యార్థులను ఉద్దేశించి ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ, స్నాతకోత్సవం విద్యకు ముగింపు కాదని, జీవితకాల అభ్యాస ప్రయాణానికి నాంది అని అన్నారు. సాంకేతికతతో నడిచే వేగంగా మారుతున్న ప్రపంచంలో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు డేటా సైన్స్ వంటి రంగాలు ఆవిష్కరణ మరియు అభివృద్ధికి కొత్త మార్గాలను తెరుస్తున్నాయని ఆయన నొక్కిచెప్పారు. దేశ నిర్మాణం కోసం సాంకేతికతను బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవాలని ఆయన విద్యార్థులను కోరారు.

# భౌతిక శాస్త్ర విభాగంలో విద్యార్థులకు అవగాహన

## -ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో

నల్గొండ, ఏప్రిల్ 4: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఎలెక్ట్రానిక్స్ అనే అంశంపై కళాశాల విద్యార్థులకు విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ విస్తృత అవగాహన కాకతీయ విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ ఎన్ వరలక్ష్మి ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి సంతోష్ కుమార్, అకాడమిక్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎన్ మల్లయ్య, ఐ క్యు ఏ సి కోఆర్డినేటర్ డాక్టర్ రామకృష్ణ, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ ఎలిషాల అశోక్ , భౌతిక శాస్త్ర విభాగ అధిపతి ఎన్ రాజశ్రీ, అధ్యాపకులు డాక్టర్ ఏ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ టి కల్పన, బి మహేంద్రరావు, డాక్టర్ జి పావని, డాక్టర్ ఆడెపు రమేష్, డాక్టర్ కె జగదీష్ బాబు, ఆర్ ఈశ్వరయ్య, కళాశాల లైబ్రేరియన్ డాక్టర్ జి రాజేశ్వర్ కుమార్, డాక్టర్ డి సంజయ్ కుమార్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎంపీ వద్దిరాజు రూ.20 లక్షలు ప్రకటన

రుద్రంపూర్, ఏప్రిల్ 04 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర రూ.20 లక్షలు ప్రకటించారు. తెలంగాణ ఉద్యమకారుడు, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నవతన్ విజ్ఞప్తి, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, ఆయన కుమారుడు రాఘవ సిఫార్సు మేరకు రవిచంద్ర కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తన ఎంపీ నిధుల నుండి రూ.20 లక్షలు ఇస్తానని ప్రకటించారు. కొత్తగూడెంలో పర్యటిస్తున్న ఎంపీ రవిచంద్రను నవతన్ కలిసి హాల్ నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదన వివరాలను అందజేశారు. తన విజ్ఞప్తి పట్ల వెంటనే సానుకూలంగా స్పందించడంతో నవతన్ సంతోషం వ్యక్తం చేస్తూ ఎంపీ వద్దిరాజు, మాజీ మంత్రి వెంకటేశ్వరరావు,ఆ యన కుమారుడు రాఘవకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు

# ముంబైలో సార్వత్రిక పార్సీ నమోదు కార్యక్రమానికి అద్భుత స్పందన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4:మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, బాంబే పార్సీ పంచాయత్ సహకారంతో ముంబైలో నిర్వహించిన సార్వత్రిక పార్సీ నమోదు కార్యక్రమం ప్రత్యేక సహాయక శిబిరానికి ఈరోజు అఖండ స్పందన లభించింది. ఈ శిబిరం సందర్భంగా జియో పార్సీ పోర్టల్‌లో సుమారు 300 కొత్త నమోదులు పూర్తయ్యాయి. ఇది సమాజంలో విస్తృత ప్రచారాన్ని బలోపేతం చేసే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగు.జియో పార్సీ అనేది పార్సీ సమాజంలో క్షీణిస్తున్న జనాభాను అరికట్టే లక్ష్యంతో భారత ప్రభుత్వం చేపట్టిన ఒక ప్రధాన కేంద్ర రంగ పథకం.

2013-14లో ప్రారంభించబడిన ఈ పథకం, వ్యవస్థీకృత చర్యలు మరియు శాస్త్రీయ మద్దతు ద్వారా పార్సీ జనాభాను స్థిరీకరించడానికి మరియు పెంచడానికి కృషి చేస్తుంది.

సంతానోత్పత్తి చికిత్స మరియు గర్భధారణ సంబంధిత సంరక్షణ కోసం వైద్య సహాయం

పిల్లల సంరక్షణ మరియు ఆధారపడిన వృద్ధుల సంరక్షణ కోసం ఆర్థిక సహాయంతో సహా సామాజిక ఆరోగ్య మద్దతు

కౌన్సెలింగ్, అవగాహన ప్రచారాలు మరియు విస్తృత ప్రచార కార్యక్రమాల వంటి ప్రచార కార్యక్రమాలు.

ఈ సభను ఉద్దేశించి మాట్లాడుతూ, మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ శ్యామా ప్రసాద్ రాయ్, వారి సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కట్టుబడి ఉంటుందని సమాజానికి హామీ ఇచ్చారు. అర్హులైన లబ్ధిదారులు ముందుకు వచ్చి ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రోత్సహించారు మరియు పథకం అమలును మరింత బలోపేతం చేయడానికి తమ అభిప్రాయాలను పంచుకోవాలని నమోదిత సభ్యులను కోరారు.శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించడం ఈ పథకంపై పెరుగుతున్న అవగాహనను, విశ్వాసాన్ని ప్రతిబింబించడమే కాకుండా, పార్సీ సమాజం యొక్క గొప్ప సాంస్కృతిక, జనాభా వారసత్వాన్ని పరిరక్షించాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని కూడా బలపరుస్తుంది.

# ఇల్లెందు మార్కెట్ కమిటీకి రికార్డు ఆదాయం

## -వరుసగా రెండోసారి రూ.4 కోట్ల మార్కెట్ ఫీజు వసూలు

ఇల్లెందు, ఏప్రిల్ 04 : ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధిలో కొత్త మైలురాయిని నమోదు చేసింది. వ్యాపారస్తులు సకాలంలో మార్కెట్ ఫీజులు చెల్లించడం, అలాగే మార్కెట్ సిబ్బంది చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌ల ఫలితంగా ఈ ఏడాది గణనీయమైన ఆదాయం సాధ్యమైంది.

మార్కెట్ సిబ్బంది నేరుగా వ్యాపారస్తుల వద్దకు వెళ్లి నెలసరి నివేదికలు సేకరించడం, ఫీజు వసూళ్లను కట్టుదిట్టంగా అమలు చేయడం ద్వారా మార్కెట్ ఆదాయం పెరిగింది. ముఖ్యంగా సుమారు 1,50,000 క్వింటాళ్ల మొక్కజొన్నను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన దానికి మార్కెట్ ఫీజు లేదు. అయినప్పటికీ ఇల్లెందు మార్కెట్ వరుసగా రెండోసారి రూ.4 కోట్ల మార్కెట్ ఫీజును వసూలు చేసి రికార్డు సృష్టించింది.

మార్కెట్ స్థాపనకు 40 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఈ స్థాయి వసూళు సాధించడం విశేషంగా నిలిచింది.

# వైద్యాధికారుల పనితీరు మెరుగుపడాలి : కలెక్టర్ రిజ్వాన్ బాషా

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 4:జిల్లాలో వైద్యాధికారుల పనితీరు మెరుగు పడాలని, వైద్య సిబ్బంది సమయపాలన కచ్చితంగా పాటించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. బయోమెట్రిక్ విధానంలో హాజరు నమోదు తప్పనిసరి చేయాలని సూచించారు. శనివారం ఐడీఓసీ సమావేశపు మందిరంలో నిర్వహించిన వైద్య, ఆరోగ్యశాఖ సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు.

ఇటీవల జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులను ఆకస్మికంగా తనిఖీ చేసినప్పుడు వివిధ సమస్యలను గుర్తించానన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా పాత ఫైల్స్ క్లియరెన్స్, పనికిరాని ఫర్నిచర్ తొలగించాలని ఆదేశించినప్పటికీ చాలాచోట్ల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సంబంధిత మెడికల్ అధికారులు బాధ్యతాయుతంగా లేకుంటే కిందిస్థాయి సిబ్బంది కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారన్నారు. లీవ్ లెటర్ రాయకుండా విధులకు గైర్హాజరైతే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వివిధ రిజిస్టర్ల నిర్వహణ, వ్యాక్సినేషన్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరగాల్సి ఉందన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా నుంచి వైద్య సేవలకు రోగులు కర్నూలుకు వెళ్లాల్సిన అవసరం ఏముందని, జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులలోనే మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. డీఎంహెచ్‌వో సంధ్య కిరణ్మయి, వైద్య కేంద్రాల డాక్టర్లు, వైద్యాధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# 16,7 కోట్ల టన్నుల సరుకు రవాణా జరగడంతో,

# సరుకు రవాణా చారిత్రాత్మక గరిష్ఠ స్థాయికి చేరుకుంది

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4:భారతీయ రైల్వే 2025-26 ఆర్థిక సంవత్సరంలో సరుకు రవాణా కార్యకలాపాలు, ప్రయాణీకుల సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, భద్రతా వ్యవస్థలు, సాంకేతికత మరియు తయారీ రంగాలలో స్వావలంబనను పెంపొందిస్తూ డిజిటల్ కార్యక్రమాలు వంటి రంగాలలో గణనీయమైన మైలురాళ్లను సాధించి, బలమైన మరియు సమగ్రమైన పురోగతిని నమోదు చేసింది. ఈ విజయాలు ఆర్థిక కార్యకలాపాలకు మద్దతు ఇవ్వడంలో, అనుసంధానాన్ని మెరుగుపరచడంలో మరియు దేశవ్యాప్తంగా సమర్థవంతమైన రవాణాను నిర్ధారించడంలో దాని కీలక పాత్రను నొక్కి చెబుతున్నాయి.

కేంద్ర రైల్వే, సమాచార ప్రసార మరియు ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖల మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్, 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారతీయ రైల్వే సాధించిన పరివర్తనాత్మక పురోగతిని నొక్కిచెప్పడానికి చీలో ప్రసంగించారు. రికార్డు స్థాయిలో సరుకు రవాణా మరియు ప్రయాణీకుల పనితీరు, కొత్త వందే భారత్ స్లీపర్ రైళ్లతో సహా వందే భారత్ సేవలను ప్రవేశపెట్టడం మరియు విస్తరించడం, ప్రమాదాలు తగ్గడం మరియు వ్యవస్థలను మెరుగుపరచడం ద్వారా భద్రతలో చారిత్రాత్మక మెరుగుదలలు, మరియు బలపడిన స్టేషన్ మరియు టెర్మినల్ మౌలిక సదుపాయాలను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. ఇవన్నీ దేశవ్యాప్తంగా అనుసంధానాన్ని సుసంపన్నం చేసి, ప్రయాణీకుల అనుభవాన్ని మెరుగుపరిచాయని ఆయన పేర్కొన్నారు.సంవత్సరం పొడవునా రైలు కార్యకలాపాలు బలంగా కొనసాగాయి. ప్రతి రోజూ సుమారు 25,000 రైళు నడుస్తూ, విస్తృతమైన అనుసంధానాన్ని కల్పించాయి. రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో అదనపు ప్రత్యేక రైలు సర్వీసులను ప్రవేశపెట్టడం ద్వారా ప్రయాణికులకు ప్రయాణ సౌకర్యం, అందుబాటు మెరుగుపడ్డాయి.

ఈ సంవత్సరంలో 16,7 కోట్ల టన్నుల సరుకు రవాణా జరగడంతో, సరుకు రవాణా చారిత్రాత్మక గరిష్ఠ స్థాయికి చేరుకుంది. బొగ్గు, సిమెంట్, ఎరువులు, ఆహార ధాన్యాలు వంటి కీలక సరుకులను సమర్థవంతంగా నిర్వహించగల భారతీయ రైల్వే సామర్థ్యాన్ని ఈ వృద్ధి ప్రతిబింబిస్తుంది. తద్వారా అన్ని రంగాలలో కీలకమైన సరఫరా గొలుసులను నిలబెట్టింది.

తయారీ రంగంలో, భారతీయ రైల్వే 1,674 లోకోమోటివ్‌లను ఉత్పత్తి చేయడం ద్వారా తన 'మేక్ ఇన్ ఇండియా' ప్రయత్నాలను బలోపేతం చేసింది. ప్రయాణికుల రోలింగ్ స్టాక్ ఆధునీకరణ కూడా కొనసాగింది. 6,677 ఎల్‌హెచ్‌బి (ఒఊః) కోచ్‌లను తయారు చేయడం ద్వారా సురక్షితమైన, మరింత సౌకర్యవంతమైన ప్రయాణానికి దోహదపడింది.

ఇప్పటికే ఉన్న వందే భారత్, అమృత్ భారత్ రైళ్ల సముదాయానికి అదనంగా, వందే భారత్ స్లీపర్ రైళ్లను ప్రవేశపెట్టడంతో ప్రయాణికుల సేవలు గణనీయమైన పురోగతిని సాధించాయి. ఈ సేవలు, ముఖ్యంగా సుదూర ప్రయాణాలకు, వేగవంతమైన, ఆధునిక మరియు ప్రయాణీకులకు అనుకూలమైన ప్రయాణ ఎంపికలను అందించడంలో ఒక ముఖ్యమైన ముందడుగును సూచిస్తాయి.స్వదేశీ కవచ్ ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ సిస్టమ్ విస్తరణతో భద్రతా కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ఇది ఇప్పుడు 3,100 రూట్ కిలోమీటర్లకు పైగా సేవలోకి వచ్చింది, అదనంగా 24,400 కిలోమీటర్ల మేర అమలు పనులు జరుగుతున్నాయి. ఈ సాంకేతికత ఆధారిత వ్యవస్థ ప్రమాదాలను నివారించడం మరియు కార్యాచరణ భద్రతను పెంచడం లక్ష్యంగా పెట్టుకుంది.

# రేవంత్ రెడ్డి కేరళ ఎన్నికల ప్రచారంలో చేస్తున్న వ్యాఖ్యలు పచ్చి అబద్ధం

## -కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

కరీంనగర్, ఏప్రిల్ 4:(నేటినిజం ప్రతినిధి) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేరళ ఎన్నికల ప్రచారంలో చేస్తున్న వ్యాఖ్యలు "పచ్చి అబద్ధం" అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రంగా విమర్శించారు. శనివారం హుజూరాబాద్‌లో రహదారుల పరిశీలన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై ముఖ్యమంత్రి వైఖరిని ఎండగట్టారు. "రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్పడంలో ఆరితేరిపోయారనీ, ఆయనకు అబద్ధాలాడుతున్నందుకు ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చు" అని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. గతంలో బీహార్, ఢిల్లీ, మహారాష్ట్ర, హర్యానా వంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఓటమికి రేవంత్ రెడ్డి చేసిన అబద్ధపు ప్రచారాలే కారణమని, ఇప్పుడు కేరళలో కూడా అదే తరహాలో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి బండి సంజయ్ ఒక



భారీ సవాల్ విసిరారు. ''తెలంగాణలో మహిళలకు నెలకు రూ. 2,500, తులం బంగారం, స్కూటీలు ఇస్తున్నారా.. వృద్ధులకు రూ. 4,000 పెన్షన్, నిరుద్యోగులకు భృతి, రైతులకు రైతు భరోసా అందుతున్నాయా.. వీటిలో ఏ ఒక్క హామీనైనా సంపూర్ణంగా అమలు చేస్తున్నట్లు రేవంత్ రెడ్డి నిరూపిస్తే.. నేను వెంటనే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేస్తా. ఒకవేళ ఏ ఒక్కటీ అమలు కాలేదని నేను నిరూపిస్తే, రేవంత్ రెడ్డి తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తారని ప్రశ్నించారు. తెలంగాణలో పథకాల అమలు తీరును ప్రత్యక్షంగా చూడాలని కేరళ ప్రజలను, మీడియా ప్రతినిధులను సంజయ్ ఆహ్వానించారు. క్షేత్రస్థాయిలో రైతు భరోసా, పెన్షన్లు, భరోసా కార్డుల పరిస్థితిని పరిశీలించి వాస్తవాలు తెలుసుకోవాలని కోరారు. రేవంత్ రెడ్డి ప్రచారం కేరళలో కాంగ్రెస్‌కు రాజకీయంగా ఇబ్బందులు తెచ్చిపెట్టే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# మాచర్ల అత్యాచార ఘటనపై మహిళా కమిషన్ సీరియస్..

అమరావతి, ఏప్రిల్ 4:పల్నాడు జిల్లా మాచర్లలో ప్రభుత్వ ఉద్యోగినిపై అత్యాచారం ఘటన తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఈ అమానుష ఘటనపై ఏపీ మహిళా కమిషన్ సీరియస్ అయ్యింది. నిందితుడిని తక్షణమే అరెస్టు చేయాలని, బాధిత మహిళను ఆదుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు బాధితురాలిని కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఫోన్‌లో పరామర్శించారు. ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. మహిళా కమిషన్, ఏపీ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

నిందితుడిని తక్షణమే అరెస్టు చేయాలని పోలీసు అధికారులను మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఆదేశించారు. ఈ విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మహిళల భద్రతపై రాజీ పడే ప్రసక్తే లేదని కామాంధులకు హెచ్చరికలు జారీ చేశారు. ఆడవారి జోలికొస్తే ఎంతటి వారైనా ఉపేక్షించమని స్పష్టం చేశారు. మహిళల రక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చైర్‌పర్సన్ వ్యాఖ్యానించారు. బాధితురాలికి అన్ని విధాలా సహాయం అందించాలని సూచించారు. ప్రస్తుతం గుంటూరు జీజీహెచ్‌లో బాధిత మహిళ చికిత్స పొందుతున్నారు.

కాగా, ఏప్రిల్ 2న సాయంత్రం 4గంటల ప్రాంతంలో పల్నాడు జిల్లా మాచర్లలో నివాసం ఉంటున్న ఓ ప్రభుత్వ ఉద్యోగిని ఇంటికి వెళ్లాడు నిందితుడు. మంచి నీళ్ల నెపంతో తలుపు తప్పి అనంతరం బలవంతంగా ఇంట్లోకి ప్రవేశించాడు. సదరు మహిళ నోట్లో బట్టలు కుక్కి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆమెను కత్తితో గాయపరిచి మర్మాంగాలపైనా రాడ్డుతో దాడి చేశాడు. తీవ్ర రక్తస్రావంతో బాధితురాలు ఆస్పత్రిలో చేరింది. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది.

# ఘోర రోడ్డు ప్రమాదం.. బావిలోకి దూసుకెళ్లిన కారు.. 9 మంది దుర్మరణం



మహారాష్ట్ర , ఏప్రిల్ 4: మహారాష్ట్ర లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బావిలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారులో ఉన్న 9 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారని మృతుల బంధువులు తెలిపారు. నాసిక్ జిల్లా డిండోరీ తాలూకా లో ఈ ప్రమాదం జరిగింది. శివాజీ నగర్‌లో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి తమ స్వగ్రామానికి వెళ్తుండగా వారిని మృత్యువు కబలించింది.

వివరాల్లోకి వెళ్తే.. నాసిక్ జిల్లాలోని డిండోరీ ప్రాంతానికి చెందిన సునీల్ దత్తాత్రేయ దర్గుడే (34).. తన భార్య రేష్మా దర్గుడే (30), కుమార్తె రాఖీ అలియాస్ గుణవతి దర్గుడే, వదిన ఆశా దర్గుడే (32), ఆమె కుమారుడు శ్రేయాస్ దర్గుడే, కుమార్తె శ్రిష్టి దర్గుడేతో కలిసి కారులో శివాజీనగర్‌లో శుక్రవారం రాత్రి జరిగిన ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. వేసవి సెలవులు కావడంతో.. ఫంక్షన్ అనంతరం రేష్మా దర్గుడే మేనకోడళ్లు మాధురి, శ్రావణి.. ఆశా దర్గుడే మేన కోడలు సమృద్ధి కూడా వారితో ఇండోర్ గ్రామానికి బయలుదేరారు.

తిరుగు ప్రయాణంలో డిండోరీ తాలూకా కేంద్రంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఓ బావిలోకి దూసుకెళ్లింది. అది గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్స్ సహాయక చర్యలు చేపట్టారు. క్రేన్ సాయంతో కారును బయటికి తీశారు. ఆ కారులో 8 మృతదేహాలు ఉన్నాయి. కారు నుంచి బయటపడిన మరో బాలిక మృతదేహాన్ని గజ ఈతగాళ్లు వెతికి వెలికి తీశారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు.

ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికిగల కారణాలపై ఆరా తీస్తున్నట్లు తెలిపారు. ప్రమాద సమయంలో సునీల్ దత్తాత్రేయ దర్గుడే కారు నడుపుతున్నట్లు తమ ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు. కాగా ఈ ప్రమాదంలో మరణించిన ఆరుగురు పిల్లలు 7 నుంచి 14 ఏళ్ల మధ్య వయసు వారేనని తెలిపారు. ఆ ఆరుగురిలో ఒకరు బాలుడు, ఐదుగురు బాలికలు ఉన్నట్లు చెప్పారు.

# మైసూరులోని "సెంట్రల్ ఫుడ్ టెక్నాలజీ & రీసెర్చ్ ఇన్స్టిట్యూట్" లో ఫుడ్ స్టార్టప్‌లపై దృష్టి సారించిన డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4:కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్, "సెంట్రల్ ఫుడ్ టెక్నాలజీ ఉ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్'' (అఈఖీఐ)లో బిరాక్-బయోనెస్ట్ ఇంక్యుబేషన్ కేంద్రాన్ని ప్రారంభించి, స్టార్టప్-ఆధారిత సాంకేతికతలు మరియు ఉత్పత్తుల ప్రదర్శనను సమీక్షించారు. ప్రయోగశాల పరిశోధనను వాణిజ్య అనువర్తనాలతో అనుసంధానించడానికి ఈ సంస్థ యొక్క ఇంక్యుబేషన్ వ్యవస్థ ఒక కీలక వేదికగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

ప్రత్యేక ఇంక్యుబేషన్ సూట్‌లు మరియు ఉమ్మడి మౌలిక సదుపాయాలతో అత్యాధునిక న దం ఎా యం ం గా రూపొందించబడిన బయోనెస్ట్ ఇంక్యుబేషన్ కేంద్రం, ఫుడ్ స్టార్టప్‌లను ప్రోత్సహించడం, అధునాతన పరిశోధనలకు మద్దతు ఇవ్వడం, ఆహార బయోప్రాసెసింగ్ మరియు బయోటెక్నాలజీలో స్కేల్-అప్ ధ్రువీకరణ మరియు నియంత్రణ సౌకర్యాలను కల్పించడం ద్వారా శాస్త్రీయ ఆలోచనలను మార్కెట్‌కు సిద్ధంగా ఉన్న పరిష్కారాలుగా మార్చడానికి వీలు కల్పిస్తుందని భావిస్తున్నారు.

మార్చి 2026 నాటికి, బయోనెస్ట్ సదుపాయం భౌతిక మరియు హైబ్రిడ్ ఇంక్యుబేటీలతో పాటు గ్రాడ్యుయేట్ అయిన వెంచర్‌లతో సహా 26 స్టార్టప్‌లకు మద్దతు ఇచ్చింది ? వీటిలో చాలా వరకు ఇప్పటికే తమ ఉత్పత్తులను వాణిజ్యీకరించాయి. ఇంక్యుబేట్ చేయబడిన కంపెనీలు సమిష్టిగా 12 పేటెంట్లను దాఖలు చేశాయి మరియు పరిశోధన ప్రచురణలకు దోహదపడ్డాయి. ఇది మార్కెట్ ఫలితాలకు అనుగుణంగా ఆవిష్కరణలపై పెరుగుతున్న ప్రాధాన్యతను ప్రతిబింబిస్తుంది.

ఈ స్టార్టప్‌లు న్యూట్రాస్యూటికల్స్, ప్రెసిషన్ ఫెర్మెంటేషన్, ప్రోబయోటిక్స్ మరియు పోస్ట్‌బయోటిక్స్, క్రిస్పర్ ఆధారిత సాంకేతికతలు మరియు బొటానికల్స్ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలలో పనిచేస్తున్నాయి. ఇది ఆహార మరియు బయోటెక్నాలజీ రంగాలలో అధిక విలువ కలిగిన, విజ్ఞానశాస్త్ర ఆధారిత విభాగాల వైపు జరుగుతున్న మార్పును సూచిస్తుంది.

పారిశ్రామికవేత్తలు మరియు వాటాదారులతో జరిగిన సంభాషణలో, డాక్టర్ జితేంద్ర సింగ్ ఒక వ్యాపారాన్ని ప్రారంభించడం సులభం అయినప్పటికీ, దానిని నిలబెట్టుకోవడానికి నిరంతర విలువ జోడింపు, మార్కెట్ ప్రాప్యత మరియు బలమైన పరిశ్రమ అనుసంధానం అవసరమని నొక్కి చెప్పారు. పరిశోధనా సంస్థలు మరియు ప్రైవేట్ రంగం మధ్య లోతైన భాగస్వామ్యం ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే, రెడీ-టు-ఈట్ మరియు కన్వీనియన్స్ ఫుడ్ విభాగాలతో సహా, వినియోగదారుల డిమాండ్‌కు అనుగుణంగా ఆవిష్కరణలను అనుసంధానించాలని ఆయన ఉద్ఘాటించారు.

పరిశోధన, అభివృద్ధి మరియు ఆవిష్కరణలను వేగవంతం చేసే లక్ష్యంతో కొత్త నిధుల యంత్రాంగాలు మరియు సంస్థాగత మద్దతు ఫ్రేమ్‌వర్క్‌లను ప్రస్తావిస్తూ, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలలో ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని విస్తరించడానికి ప్రభుత్వం చేస్తున్న కృషిని కూడా మంత్రి హైలైట్ చేశారు. సాంకేతిక పరిజ్ఞానాల పట్ల అవగాహన మరియు స్వీకరణను మెరుగుపరచడానికి శాస్త్రీయ సంస్థలు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు మరియు లక్షిత కమ్యూనికేషన్ వ్యూహాల ద్వారా తమ ప్రచారాన్ని పెంచుకోవాలని, అదే సమయంలో బయోటెక్నాలజీ, అంతరిక్షం మరియు ప్రత్యేక పోషణ వంటి రంగాలలో సమన్వయాన్ని ప్రోత్సహించాలని ఆయన నొక్కి చెప్పారు.

ఈ కార్యక్రమంలో నాలుగు అవగాహన ఒప్పందాలపై సంతకాలు జరిగాయి అభివృద్ధి చేసిన రెండు ఉత్పత్తులను ప్రారంభించారు. ఇది పరిశ్రమతో నిరంతర భాగస్వామ్యానికి మరియు అంతర్గత సాంకేతిక పరిజ్ఞానాల వాణిజ్యీకరణకు సంకేతం. ఆవిష్కరణలను విస్తరించడానికి మరియు సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలతో సంబంధాలను బలోపేతం చేయడానికి ఇటువంటి సహకారాలు చాలా కీలకమని అధికారులు తెలిపారు.

# ప్రాణం తీసిన పాత కక్షలు.. టిప్పర్‌తో ఢీకొట్టి హత్య

బపాత కక్షలు ఓ వ్యక్తి ప్రాణాలు తీశాయి. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తిని ప్రత్యర్థులు టిప్పర్‌తో ఢీకొట్టి హతమార్చారు. ఈ ఘటన నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రంలో చోటుచేసుకుంది.

భూతగాదాల విషయంలో పాత లక్షలుండటంతో మహేష్ అనే వ్యక్తిని కారులో ప్రయాణిస్తుండగా.. ప్రత్యర్థులు టిప్పర్ ఢీకొట్టారు. అనంతరం ఈ ఘటనను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు యత్నించారు. భూ తగాదాలకు సంబంధించి అడ్డు వస్తున్నాడని మహేశ్‌ను ప్రత్యర్థులు దాడి చేసి చంపినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# మేడారం ఘటనపై మంత్రులు రాజీనామా చేయాలి : ఎమ్మెల్సీ మధుసూదనాచారి

వరంగల్, ఏప్రిల్ 4: మేడారం గద్దెల వద్ద గతనెల 25న జరిగిన ప్రమాదానికి మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ బాధ్యత వహించి తమ పదవులకు రాజీనామా చేయాలని తెలంగాణ శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి , ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి డిమాండ్ చేశారు.

హన్మకొండలో ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న సమ్మక్క పూజారి కుమారుడు యువన్‌ను వారు పరామర్శించారు. బాలుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా బాలుడికి తీవ్ర నష్టం జరిగిందని తెలిపారు. మంత్రి సీతక్క వచ్చి పరామర్శించి రూ. 10వేలు చేతిలో పెట్టి వెళ్లి ఇప్పటి వరకు పట్టించుకోలేదని ఆరోపించారు. మంత్రులు ఇప్పటివరకు బాలుడిని ఆదుకునేందుకు ముందుకు రాకపోవడంపై అగ్రహం వ్యక్తం చేశారు.

బాలుడికి అయ్యే వైద్య ఖర్చులన్నీ ప్రభుత్వమే భరించి, అతడి భవిష్యత్ కోసం కోటి రూపాయలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. బాధితుడి తల్లిదండ్రులకు ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. వీరివెంట ఎట్టి జగదీష్, మాజీ జడ్పీటీసీ రామసహాయం శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్, ఈసం రామ్మూర్తి, మాజీ మదరి రామయ్య, కేయూ బీఆర్‌ఎస్వీ నాయకులు కొనుకంటి ప్రశాంత్, తాడ్వాయి మండల యూత్ అధ్యక్షులు కోట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐ సమ్మిట్‌ను ప్రారంభించిన మంత్రి కొల్లు రవీంద్ర



న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) వైపు ఐటీ రంగం వేగంగా మారుతోందని ఆంధ్రప్రదేశ్ గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. దీనికి అనుగుణంగా మన మానవ వనరులకు తగిన శిక్షణ ఇవ్వడం చాలా అవసర మని మంత్రి అభిప్రాయపడ్డారు. అమరావతి రీజియన్‌లో ఏఐ సమ్మిట్‌ను మంత్రి కొల్లు రవీంద్ర ప్రారంభించారు. కృత్రిమ మేధపై అవగాహన పెంచేందుకు, భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు ఏపీ ప్రభుత్వం, ఎస్‌టీపీఐ ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కెరీర్ పట్ల స్పష్టత, టెక్నాలజీకి అనుగుణంగా స్కిల్స్ పెంచుకోవడంపై దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ..' ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఐఎ)లో వస్తున్న మార్పులు, భవిష్యత్ తరాలకు అందించాల్సిన శిక్షణపై ఈరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు అమరావతి, విజయవాడలో ఈ నాలుగో సదస్సును నిర్వహిస్తున్నాం. గతంలో విశాఖపట్నంలో రెండు సార్లు, కాకినాడలో ఒకసారి ఈ కార్యక్రమాలు జరిగాయి. 25 ఏళ్ల కిందట సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయాల వల్ల ఐటీ రంగంలో తెలుగువారు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. హైదరాబాద్ ఒక మహానగరంగా అభివృద్ధి చెందింది. విశాఖపట్నంలో డేటా సెంటర్లు ఏర్పాటు కాబోతున్నాయి.

ఇప్పటికే మూడు గిగావాట్ల డేటా సెంటర్స్ కోసం ఒప్పందాలు జరిగాయి. మరో 3 గిగావాట్లు పైప్‌లైన్‌లో ఉన్నాయి. క్వాంటమ్ కంప్యూటింగ్ ఇనిషియేటివ్‌ను అమరావతిలో ప్రారంభించడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరోస్థాయికి తీసుకెళ్తుంది. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే రూ. 13.5 లక్షల కోట్ల పెట్టుబడులు రాగా.. సుమారు రూ. 6.5 లక్షల మందికి ఉపాధి లభించింది. ఉత్తరాంధ్రకి గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి సంస్థలు వచ్చాయి. రాయలసీమలోనూ ఎలక్ట్రానిక్, ఆటోమొబైల్ రంగాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా నిలబెట్టడమే మా లక్ష్యం' చెప్పారు.

# వలస కార్మిక చట్టం అమలు చేయాలి : సీఐటీయూ

బజీవనోపాధి కోసం ఇతర రాష్ట్రాల నుండి వలసలు వచ్చి పరిశ్రమలు నడవడానికి ఉపయోగపడుతున్న వలస కార్మికుల రక్షణ చేపట్టవలసిన బాధ్యత యాజమాన్యాలపై ఉందని సీఐటీయూ నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షుడు దండెంపల్లి సత్తయ్య అన్నారు. శనివారం సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కనగల్ మండలం కురంపల్లి మహావీర్ రైస్ ఇండస్ట్రీ, పర్వతగిరి వెంకటసాయి రైస్ ఇండస్ట్రీ లలో పనిచేస్తున్న కార్మికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ.. వలస కార్మికులు దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరిగిన సందర్భంలో ఎలాంటి నష్ట పరిహారాలు పొందలేకపోతున్నారన్నారు.

రైస్ మిల్లుల్లో హమాలీ పనులు, మిల్లు డ్రైవర్లుగా బీహార్, ఉత్తరప్రదేశ్, నేపాల్ లాంటి దేశం నుండి కూడా తెలంగాణకు వచ్చి పనులు చేస్తున్నారని, ప్రభుత్వం వలస కార్మికుల చట్టం పగడ్బందీగా అమలు జరిగే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. లేబర్ అధికారులు వలస కార్మికుల సంఖ్య సేకరించాలని డిమాండ్ చేశారు. ఈ సర్వేలో సీఐటీయూ కనగల్ మండల కన్వీనర్ నేలకొండరాని లింగయ్య, హమాలీ యూనియన్ నాయకులు బురకల నరసింహ, కాడింగ్ భిక్షం, సూరజ్, పటేల్, సంతోష్, అరవింద్ పాల్గొన్నారు.

# ఎయిమ్స్ బీబీనగర్ పేరిట నకిలీ ఉద్యోగ ప్రకటనలు

నల్గొండ, ఏప్రిల్ 4:ఎయిమ్స్ బీబీనగర్ పేరిట ఎయిమ్స్ బీబీనగర్ జాబ్ ఆపర్చునిటీస్?2026" పేరుతో వివిధ వేదికలలో ప్రచారం జరుగుతున్న ఉద్యోగ ప్రకటనలు పూర్తిగా నకిలీవని ఎయిమ్స్ అధికారులు స్పష్టం చేశారు. ఎలాంటి పరీక్షలు లేకుండా నేరుగా ఎంపిక చేస్తామని పేర్కొంటూ ప్రచారం చేస్తున్న ఈ ప్రకటనలతో సంస్థకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఎయిమ్స్ బీబీనగర్ తరఫున ఇలాంటి నియామక ప్రకటనలు ఎప్పుడూ విడుదల చేయలేదని, నియామకాలు ఎల్లప్పుడూ సరైన ఎంపిక విధానం ద్వారా మాత్రమే నిర్వహించబడతాయని వెల్లడించారు. సంస్థకు సంబంధించిన అన్ని అధికారిక ఉద్యోగ ప్రకటనలు కేవలం అధికారిక వెబ్‌సైట్, పత్రికల ద్వారానే విడుదల అవుతాయని పేర్కొన్నారు. నకిలీ ప్రకటనలకు మోసపోవద్దని ప్రజలకు సూచించారు.

# ఎంజీయూలో జాబ్ మేళాకు విశేష స్పందన

## -ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 750 మంది విద్యార్థులు హాజరు
## - 80 మందికి ఉద్యోగావకాశాలు



నల్గొండ, ఏప్రిల్ 4:నల్లగొండలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీలో యూనివర్సిటీ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో శనివారం వర్సిటీలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. 15 మల్టీ నేషనల్ కంపెనీలతో నిర్వహించిన మేళాకు యూజీ, పీజీ కోర్సులు పూర్తి చేసిన వారితో పాటు ఆయా కోర్సులు చివరి సంవత్సరం చదు వుతున్న 750 మంది అభ్యర్థులు హాజర య్యారు. ఆయా కంపెనీల ఆధ్వర్యంలో ఉదయం రాత పరీక్షలు నిర్వహించి షార్ట్ లిస్ట్ చేశారు. ఎంపికైన వారికి ఇంటర్వ్యూలు నిర్వ హించగా 80 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు.

ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ.. విద్యతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో యూనివర్సిటీలో మెగా జాబ్ మేళా నిర్వహించినట్లు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను స్ఫూర్తిగా తీసుకుని మిగిలిన అభ్యర్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ తో పాటు సబ్జెక్ట్ పెంచుకోవాలని సూచించారు. ఎంపికైన వారందరికీ అభినందనలు తెలిపారు.

యూనివర్సిటీ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ కె. హరీష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిజిస్టర్ ప్రొఫెసర్ కొప్పుల అంజిరెడ్డి, టాస్క్ కో ఆర్డినేటర్ ప్రదీప్ రెడ్డి, యూనివర్సిటీ వివిధ విభాగాల అధికారులు, ఆయా కంపెనీల హెచ్‌ఆర్ లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలి : సర్పంచ్ మనోజ్

నల్గొండ, ఏప్రిల్ 4:ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని తుంగతుర్తి మండలం రావులపల్లి సర్పంచ్ చింతకుంట్ల మనోజ్ అన్నారు. శనివారం గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ప్రతిభ కలిగిన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాం ప్రభుత్వం అందిస్తోందని తల్లిదండ్రులు తమ పిల్లల ను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో ఉపాధ్యాయుడు చిలుక శ్రీనివాస్, శ్రీను పాల్గొన్నారు.

# చట్ట వ్యతిరేక కార్యకలాపాల నివారణలో తీర రక్షణ దళ సేవలు

## ఏప్రిల్ 5...జాతీయ సముద్రతీర దినోత్సవం

భారత తీర రక్షణ దళం... నావికాదళం, మత్స్య శాఖ, రెవెన్యూ శాఖ (కస్టమ్స్), కేంద్ర మరియు రాష్ట్ర పోలీసు దళాల సహకారంతో పని చేస్తుంది.

1960లలో స్మగ్లింగ్ కార్యకలాపాలు ఎక్కువ అవటం కారణంగా కస్టమ్స్ శాఖ వారికి... తీర గస్తీకి నౌక దళం అవసరం ఏర్పడింది. స్మగ్లింగ్ నిరోధక ప్రయత్నంలో పెట్రోలింగ్ సహాయం కోసం భారత కస్టమ్స్ విభాగం తరచూ భారత నావికా దళాన్ని పిలిపించేది. క్రమంగా భారతీయ ప్రభుత్వం నౌక, వైమానిక దళ అధికారులతో సమితిని ఏర్పాటు చేసింది. భారత తీర రక్షణ దళ స్థాపన కోసం భారత నావికాదళం మొదట దేశానికి సైనిక రహిత సముద్ర సేవలను అందించడానికి ప్రతిపాదించింది. సమస్యను అధ్యయనం చేయడానికి భారత నావికాదళం, భారత వైమానిక దళం భాగస్వామ్యంతో నాగ్‌చౌధురి కమిటీని ఏర్పాటు చేశారు. ఆగష్టు 1971 లో, భారతదేశం లోని విస్తారమైన తీర ప్రాంతంలో పెట్రోలింగ్ చేయవలసిన అవసరాన్ని కమిటీ గుర్తించింది. అక్రమ కార్యకలాపాలను గుర్తించడానికి ఆఫ్‌షోర్ ఫిషింగ్ ఓడల రిజిస్ట్రీని ఏర్పాటు చేసింది. చట్టవిరుద్ధ కార్యకలాపాలలో నిమగ్నమైన ఓడలను అడ్డగించడానికి సమర్థవంతమైన, సుసంపన్నమైన రక్షణ శక్తిని ఏర్పాటు చేసింది. ఆ సేవలను అందించడానికి అవసరమైన పరికరాలు, మౌలిక సదుపాయాలు, సిబ్బంది సంఖ్య, స్వభావాన్ని కూడా కమిటీ పరిశీలించింది.

1973 నాటికి, భారతదేశం పరికరాలను సంపాదించడానికి ఒక కార్యక్రమాన్ని ప్రారంభించింది. అంతర్గత భద్రతా నిర్వహణ చట్టం నిబంధనల ప్రకారం, స్మగ్లింగ్ నిరోధక మరియు చట్ట అమలు పనుల కోసం భారత నావికా దళానికి చెందిన సిబ్బందిని నియమించడం ప్రారంభించింది. అప్పటి నావికాదళ సిబ్బంది చీఫ్ అడ్మిరల్ సౌరేంద్ర నాథ్ కోహ్లీ రక్షణ కార్యదర్శికి ఒక సిఫారసు చేసారు. రక్షణ విధులను చేపట్టడానికి ప్రత్యేక సముద్ర సేవ ఆవశ్యకతను, దాని స్థాపనలో నేవీ సహాయాన్ని అందించాల్సిన అవసరాన్ని వివరించారు. అడ్మిరల్ కోహ్లీ సిఫారసుపై, రక్షణ కార్యదర్శి 1974 ఆగస్టు 31 న కేబినెట్ కార్యదర్శికి నోట్ సమర్పించారు. పర్యవసానంగా, 1974 సెప్టెంబరులో, భారత మంత్రివర్గం ఖుస్రో ఫరాముర్జ్ రుస్తాంజీ అధ్యక్షతన రుస్తాంజీ కమిటీని ఏర్పాటు చేసింది. నేవీ, వైమానిక దళం, రెవెన్యూ శాఖల భాగస్వామ్యంతో భద్రత మరియు చట్ట అమలులో అంతరాలను పరిశీలించడానికి భారత నావికాదళం, కేంద్ర మరియు రాష్ట్ర పోలీసు దళాలు, బొంబాయి హై నుండి చమురు ఆవిష్కరణ సముద్ర చట్ట అమలు మరియు రక్షణ సేవ యొక్క అవసరాన్ని మరింత నొక్కి చెప్పింది. ఈ కమిటీ 31 జూలై 1975 న రక్షణ మంత్రిత్వ శాఖలో ఇండియన్ కోస్ట్ గార్డ్ ఏర్పాటుకు సిఫారసు చేసింది. కేబినెట్ కార్యదర్శి ఈ సేవను హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ క్రింద ఉంచాలని సిఫారసు చేశారు. అప్పుడు ప్రధాని ఇందిరా గాంధీ కేబినెట్ కార్యదర్శిని తప్పుపట్టి, ఈ సేవను రక్షణ మంత్రిత్వ శాఖ క్రింద ఉంచడానికి రుస్తాంజీ కమిటీ అసలు సిఫార్సును అంగీకరించాలని నిర్ణయించు కున్నారు.




1 ఫిబ్రవరి 1977 న తాత్కాలిక ఇండియన్ కోస్ట్ గార్డ్ అమలు లోనికి వచ్చింది. ఇందులో రెండు చిన్న కొర్వెట్టలు మరియు ఐదు పెట్రోల్ బోట్లు నేవీ నుండి బదిలీ చేయబడ్డాయి. కోస్ట్ గార్డ్ చట్టంలో రక్షణ దళం విధులు అధికారికంగా నిర్వచించ బడ్డాయి, దీనిని భారత పార్లమెంట్ 18 ఆగస్టు 1978 న ఆమోదించింది. తద్వారా వెంటనే అమలులోకి వచ్చింది. భారత నావికా దళానికి చెందిన వైస్ అడ్మిరల్ వి. ఎ. కామత్‌ను వ్యవస్థాపక డైరెక్టర్ జనరల్‌గా నియమించారు. సేవ ప్రారంభోత్సవంలో ప్రధాని మొరార్జీ దేశాయ్ గార్డ్ ఆఫ్ ఆనర్ ను పరిశీలించారు. వైస్ అడ్మిరల్ కామత్ 1984 నాటికి ఐసిజిని శక్తివంతమైన శక్తిగా అభివృద్ధి చేయటానికి ఐదేళ్ల ప్రణాళికను ప్రతిపాదించాడు, కాని ఆర్థిక వనరుల సంక్షోభం కారణంగా ఈ ప్రణాళిక పూర్తి లక్ష్యం నెరవేర లేదు.

ఇండియన్ కోస్ట్ గార్డ్ అధికారికంగా 18 ఆగస్టు 1978 న భారత పార్లమెంట్ యొక్క కోస్ట్ గార్డ్ చట్టం, 1978 చేత స్థాపించ బడింది. ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐసిజి) ఒక ప్రత్యేక సముద్ర నేవీ చట్టం కలిగి ఉంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ సెర్చ్ అండ్ రెస్క్యూ ఏజెన్సీ. రక్షణ మంత్రిత్వ శాఖ క్రింద పనిచేస్తుంది. ఇది భారత దేశ సముద్ర ప్రయోజనాలను పరిరక్షిస్తుంది, సముద్ర చట్టాన్ని అమలు చేస్తుంది. ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐ.సి.జి) ప్రపంచం లోని ఇతర కోస్ట్ గార్డ్లతో కలిసి సమన్వయంతో పని చేస్తుంది. మే 2005 లో, పాకిస్తాన్ మారిటైమ్ సెక్యూరిటీ ఏజెన్సీ (పిఎంఎస్ఎ) తో సంబంధాలు ఏర్పరచు కోవడానికి ఐసిజి అంగీకరించింది. 2006 లో, ఇండియన్ కోస్ట్ గార్డ్ తన జపనీస్, కొరియన్ సహ చరులతో కలిసి కార్యకలాపాలు నిర్వహించింది. 2008 ముంబై దాడుల తరువాత, భారత ప్రభుత్వం ఐసిజి ఫోర్స్, ఆస్తులు, మౌలిక సదుపాయాలను విస్తరించే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇండియన్ కోస్ట్ గార్డ్ డైరెక్టర్ జనరల్ కోస్టల్ కమాండ్ తీర భద్రతకు సంబంధించిన అన్ని విషయాలలో కేంద్ర మరియు రాష్ట్ర సంస్థల మధ్య సమన్వయానికి బాధ్యత వహిస్తారు. కృత్రిమ ద్వీపాల రక్షణ, సముద్రంలో మత్స్యకారులు, నావికులకు రక్షణ, సహాయం, కాలుష్య నియంత్రణతో సహా సముద్ర పర్యావరణం, పర్యావరణ పరిరక్షణ, తీరం గురించి శాస్త్రీయ సమాచార సేకరణ, స్మగ్లింగ్ నిరోధక చర్యలలో కస్టమ్స్ శాఖ, ఇతర అధికారులకు సహాయం, రక్షణ, ప్రాదేశిక మరియు అంతర్జాతీయ జలాల్లో చట్ట అమలు, తదితర కార్య క్రమాలను నిర్వహిస్తుంది.

-రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494



---

# కిడ్స్ కాన్వెంట్ స్కూల్ లో ఎగ్జిబిట్ షో



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 4: నేటినిజం (ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్లో శనివారం వన్ లర్న్ పబ్లిషర్స్ ఆధ్వర్యంలో ఎగ్జిబిట్ షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ సబ్జెక్టుల వారి చిన్నారులు వివిధ ఎగ్జిబిట్ లు తయారుచేసి ఆకట్టుకున్నారు తెలుగు, హిందీ, ఇంగ్లీష్, సైన్స్ మ్యాథ్స్, సోషల్ సబ్జెక్టుల వారిగా ఎగ్జిబిట్ తయారుచేసి వాటి గురించి అర్థమయ్యే విధంగా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు చిన్నారులు వివరించారు. సబ్జెక్టులు సులభంగా అర్థం కావడానికి ఈ ఎగ్జిబిట్ లు ఉపయోగపడతాయని కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్ ప్రిన్సిపల్ ధరక్షన్ వసూపియాతెలియజేసారు. కరస్పాండెంట్ నరాల దేవేందర్ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్ లో అత్యుత్తముగా చేసిన ఎగ్జిబిట్ లకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వన్ లర్న్ పబ్లిషర్ కోఆర్డినేటర్, కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్ కరస్పాండెంట్ నరాల దేవేందర్, ప్రిన్సిపాల్ ధరక్షన్ వసూపియా, స్కూల్ టీచర్స్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎంపీ వద్దిరాజు రూ.20 లక్షలు ప్రకటన

ఖమ్మం, ఏప్రిల్ 4:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర రూ.20 లక్షలు ప్రకటించారు. తెలంగాణ ఉద్యమకారుడు, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నవతన్ విజ్ఞప్తి, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, ఆయన కుమారుడు రాఘవ సిఫార్సు మేరకు రవిచంద్ర కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తన ఎంపీ నిధుల నుండి రూ.20 లక్షలు ఇస్తానని ప్రకటించారు. కొత్తగూడెంలో పర్యటిస్తున్న ఎంపీ రవిచంద్రను నవతన్ కలిసి హాల్ నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదన వివరాలను అందజేశారు.

# సమాజ భద్రతకు సీసీ కెమెరాల ఏర్పాటు అత్యంత అవసరం

## -ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 4: నేటినిజం (ప్రతినిధి): నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, ఒక్క సీసీ కెమెరా100 మంది పోలీసులతో సమానంగా పనిచేస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 24 సీసీ కెమెరాలను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తో కలిసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చి 24 కెమెరాలు ఏర్పాటు చేసిన మార్గం గోపిని జిల్లా ఎస్పీ, ప్రభుత్వ విప్ అభినందించారు. అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడుతూ గతంతో పోల్చితే ప్రస్తుతం పోలీసింగ్‌లో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పోలీసు శాఖ నేరాల నియంత్రణలో ముందుకు సాగుతోందన్నారు. నేరాలను ముందుగానే నివారించడంతో పాటు,కేసుల చేదనలో కూడా సీసీ కెమెరాలు ఎంతో సహాయపడతాయన్నారు. ప్రజలు, వ్యాపారస్తులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ పరిసరాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ



మాట్లాడుతూ సీసీ కెమెరాలు నేరాలను అరికట్టడమే కాకుండా, జరిగిన ఘటనలపై వేగంగా దర్యాప్తు చేయడంలో కూడా ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. ప్రజల సహకారంతో ప్రతి గ్రామం, ప్రతి వీధిలో సీసీ కెమెరాల ఏర్పాటు జరిగితే సమాజం మరింత సురక్షితంగా మారుతుందని అన్నారుమండల ప్రజల,ప్రయాణికుల సౌకర్యార్థం రుద్రంగి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన బస్ స్టాండ్‌ను ప్రారంభిం చారు. ఈబస్ స్టాండ్ ప్రారంభంతో మండలంలోని ప్రజలకు రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయని,గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వెళ్లే ప్రయాణికులకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు.ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు సురక్షితంగా ప్రయాణం చేసేందుకు పోలీస్ శాఖ సమర్థవంతమైన రక్షణా చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిఎస్పీ శ్రీనివాస్, సి.ఐ వెంకటేశ్వర్లు,తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీఓ నటరాజ్, ఎస్ఐలు మోతిలాల్, రమేష్, సర్పంచ్ నారాయణ, ఉపసర్పంచ్ అభిలాష్,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఇండస్ట్రియల్ టూర్



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 4: నేటినిజం (ప్రతినిధి): వేములవాడ పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు టూరిజం అండ్ హాస్పిటాలిటీ, హెల్త్‌కేర్ విభాగాలపై అవగాహన పెంపొందించుకునేందుకు కరీంనగర్ లోని శ్వేత హోటల్, చల్మెడ ఆనందరావు మెడికల్ కాలేజ్ హాస్పిటల్‌ను సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులు హోటల్‌లో నిర్వహణ విధానాలు, అతిథి సత్కారం, సేవల ప్రమాణాలు గురించి ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. అనంతరం మెడికల్ కాలేజ్ హాస్పిటల్‌లోని వివిధ విభాగాలను సందర్శించి, ఆరోగ్య సేవల నిర్వహణపై సమగ్ర సమాచారం పొందారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పలు విషయాలను నేర్చుకున్నారు.పాఠశాల వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం, ఇటువంటి ఇండస్ట్రియల్ టూర్లు విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజారత్నం, ఉపాధ్యాయులు రవీందర్, సలాం, హమీద్, దివ్య, రోహిణి, శ్రీలత పాల్గొన్నారు.

# రాజన్న క్షేత్రం నుండి పుణ్యక్షేత్రాలకు రవాణా సౌకర్యాలు

## – ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

## -కాళేశ్వరం-యాదాద్రికి నూతన బస్సు సేవలు ప్రారంభం

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 4: నేటినిజం (ప్రతినిధి): వేములవాడ బస్ డిపో నుండి కాళేశ్వరం, యాదగిరిగుట్టకు నూతన బస్సు సర్వీసులను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే వేములవాడ నుండి తిరుపతి కు బస్సు సర్వీస్ విజయవంతంగా నడుస్తోందని తెలిపారు. త్వరలోనే భద్రాచలం, బాసర వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలకు కూడా సర్వీసులు ప్రారంభించే యోచనలో ఉన్నట్లు వెల్లడించారు.వేములవాడ బస్ స్టాండ్ ఆధునీకరణకు రూ.1.60 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే కథలాపూర్, రుద్రంగి, చందుర్తి, కోనరావుపేట బస్టాండ్లను కూడా త్వరలో ఆధునీకరించనున్నట్లు పేర్కొన్నారు. తిప్పాపూర్ బస్టాండ్‌ను తొలగించే ప్రయత్నాలను అడ్డుకున్న విషయాన్ని గుర్తుచేసుకుంటూ, అది వేములవాడకు ముఖ్యమైన కేంద్రంగా నిలుస్తుందని అన్నారు.ప్రాంతీయ కనెక్టివిటీ పెంపులో భాగంగా సిరిసిల్ల, మెట్పల్లి, జగిత్యాల, కరీంనగర్, కోరుట్ల డిపోల నుండి బస్సు సర్వీసులు పెంచాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. వేములవాడ?సిరికొండ మార్గంలో కూడా త్వరలోనే మరిన్ని సర్వీసులు అందు బాటులోకి రానున్నాయి.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా పెద్ద ఎత్తున ఆర్థిక ఉపశమనం లభిస్తున్నదని, దీనివల్ల ఆర్టీసీ



కూడా లాభాల్లో నడుస్తోందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో వ్యాపార కార్యకలాపాలు కూడా పెరిగినట్లు తెలిపారు.అలాగే రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.150 కోట్లతో పనులు కొనసాగుతున్నాయని, గోదావరి పరివాహక ప్రాంతంలోని పుణ్యక్షేత్రాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నదని వెల్లడించారు.ప్రజలు ఎక్కువగా ఆర్టీసీ బస్సులను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పుల్కం రాజు, ఆర్టీసీ డిపో మేనేజర్ బోనాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, వైస్ చైర్మన్ కనకరపు రాకేష్, కౌన్సిలర్లు టైలర్ శ్రీనివాస్, తోటరాజు, ఇప్పపుల అజయ్, శ్రీనివాస్, కొండ శేఖర్, కాంగ్రెస్ నాయకులు సం ద్రగిరి శ్రీనివాస్ గౌడ్,, కూరగాయల కొమురయ్య, ఆర్టీసీ పిఆర్ఓ శ్రీనివాస్

# ప్రజా తీర్పును అపహాస్యంచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## - కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బాల్క సుమన్

కరీంనగర్, ఏప్రిల్ 4:(నేటినిజం (ప్రతినిధి) ప్రజాస్వామ్యంపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీయకుండా, ప్రలోభాలకు లొంగకుండా వ్యవహరించిన క్రమశిక్షణ గల నాయకులు బిఆర్ఎస్, సీపీఐ పార్టీలవారేనని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పేర్కొన్నారు. శనివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శ్వేత హోటల్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశంలో చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తో పాటు జిల్లా బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు బిఆర్ఎస్, సీపీఐ పార్టీలకు స్పష్టమైన మెజారిటీ ఇచ్చారని గంగుల కమలాకర్ తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వం కౌన్సిలర్లపై ఒత్తిడి తీసుకువస్తూ, ప్రలోభాలకు గురిచేస్తూ మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఎన్నికల కమిషన్, అధికారులు వెంటనే స్పందించి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన బాల్క సుమన్, ప్రస్తుత ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. “ఇది ప్రజాపాలన కాదు, పాపపు పాలన” అంటూ వ్యాఖ్యానించారు. క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ పీఠం దక్కించుకోవడానికి ప్రభుత్వం, జిల్లా మంత్రి కలిసి కుట్రలు పన్నారని ఆరోపించారు. గెలిచిన అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేసి, పోలీస్ బలాన్ని ఉపయోగించి తనను, తన అనుచరులను జైలుకు పంపిన ఘటన ప్రజలకు తెలిసిందేనని అన్నారు .కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బిఆర్ఎస్ నేతలు విమర్శించారు. భవిష్యత్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సింగిల్ డిజిట్‌కు పరిమితం అవుతుందని వారు అంచనా వేశారు. గతంలో బిఆర్ఎస్ పాలనలో పంచాయతీ ఎన్నికల్లో 96 శాతం, మున్సిపల్ ఎన్నికల్లో 98 శాతం విజయాలు సాధించామని గుర్తుచేశారు.



ప్రస్తుతం కాంగ్రెస్‌కు పంచాయతీలలో 38 శాతం, మున్సిపాలిటీలలో 56 శాతం మాత్రమే రావడం ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకతకు నిదర్శనమని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మూడు లక్షల కోట్ల రూపాయల అప్పులు తీసుకుందని, ఆ నిధులు ప్రజా సంక్షేమానికి కాకుండా ఇతర ప్రయోజనాలకు వినియోగిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూసీ ప్రాజెక్ట్ పేరుతో భారీ ఖర్చులకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.అలాగే తమ ప్రభుత్వ కాలంలో కరీంనగర్ నగరంలో మానేరు రివర్ ఫ్రంట్, కేబుల్ బ్రిడ్జ్, ఐలాండ్స్ సుందరీకరణ వంటి అభివృద్ధి పనులు చేపట్టామని, ప్రస్తుతం నగర అభివృద్ధి మందగించిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, పార్టీ జిల్లా అధ్యక్షులు జీవి రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ జిల్లాకు గద్దర్ పేరు పెట్టాలి.. డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి డిమాండ్

మెదక్, ఏప్రిల్ 4: గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 6వ తేదీన హైదరాబాద్‌లో జరిగే ‘ప్రశ్నించే గొంతులు సాధించిన విజయాలు’పై జరిగే రాష్ట్రస్థాయి సభను జయప్రదం చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సభ పోస్టర్‌ను సిద్దిపేట జిల్లా రాయపోల్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో విడుదల చేశారు.

ఈ సందర్భంగా డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ.. మెదక్ జిల్లాకు గద్దర్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రజా యుద్ధ నౌక గద్దర్‌పై కాల్పులు జరిపిన ఏప్రిల్ 6వ తేదీన గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా సభ నిర్వహిస్తున్నామని తెలిపారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**